Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 188 మేడ్చల్ మల్కాజ్‌గిరి 29 జూలై 2023 శనివారం పేజీలు : 4

## రుణ వసూళ్లలో కఠిన చర్యలు వద్దు: నిర్మల

న్యూఢిల్లీ : రుణాలను తిరిగి వసూలు చేసే విషయంలో రుణగ్రహీ తలపై కఠిన చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులను ఆదేశించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్ తెలిపారు. ఇలాంటి కేసుల్లో బ్యాంకులు సున్నితంగా వ్యవహరించాలని కూడా సూచించినట్టు చెప్పారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరా ల సమయంలో చిన్న రైతులు తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపుల కు సంబంధించి న ప్రశ్నపై ఈమె ఈ విధంగా సమాధానమిచ్చారు. "కొన్ని బ్యాంకులు రుణాల వసూళ్ల విషయంలో ఎంత నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాయో నా దృష్టికి వచ్చింది. రుణాల వసూలు విషయంలో కఠిన చర్యలు తీసుకోవద్దని బ్యాంకులన్నిం టినీ ప్రభుత్వం ఆదేశించింది" అని ఆమె పేర్కొన్నారు.




# ఉగ్ర గోదావరి

## భద్రాచలం, ధవళేశ్వరంలో కొనసాగుతున్న రెండవ ప్రమాద హెచ్చరిక

## భయం గుప్పిట్లో ముంపుగ్రామాలు!!

హైదరాబాద్ / అమరావతి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో పాటు, ఎగువ నుండి వస్తున్న వరదతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. నీటిమట్టం తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతున్న పరిస్థితి ఉంది. నేడు ఉదయం 6 గంటల సమయంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 46.20 అడుగుల వద్ద ఉంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. అలాగే ధవళేశ్వరం వద్ద కూడా రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ గోదావరి వరదల నేపథ్యంలో ఆందోళనకర పరిస్థితి ఉంది. గోదావరి నదిలో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో రెండు రాష్ట్రాల అధికారులు అప్రమత్తమయ్యారు. గోదావరి నది పరివాహక ప్రాంతాలలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఇదిలా ఉంటే రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద కూడా గోదావరి నదికి రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఇదిలా ఉంటే ములుగు జిల్లా వాజేడు మండలంలో గోదావరి నదికి వరద పోటెత్తడంతో అనేక ప్రాంతాలు గుంపుకు గురవుతున్నాయి. గోదావరి



నది నీటిమట్టం పేరూరు వద్ద ఈరోజు ఉదయం నీటి మట్టం 48.44 అడుగులకు పెరిగింది. వెంకటాపురం భద్రాచలం మార్గంలో బ్రిడ్జి పై వరద ప్రవహిస్తోంది. వెంకటాపురం వాజేడు మండలాలలో కూడా రోడ్లపైకి భారీగా నీరు చేరుకుంది. గోదావరి వరదల కారణంగా టేకులగూడెం, వీరభద్రవరం , సుర వీడు ప్రాంతాలలో రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ గోదావరి కి కొనసాగుతున్న వరద ఉధృతితో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. గోదావరి కి కొనసాగుతున్న వరద ఉధృతి భద్రాచలం వద్ద ప్రస్తుతం 46.5 అడుగుల వద్ద కొనసాగుతుందని, ధవళేశ్వరం వద్ద ప్రస్తుత ఇన్ ఫ్లో,ఔట్ ఫ్లో 13.57 లక్షల క్యూసెక్కులుగా ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీంతో ధవళేశ్వరం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని పేర్కొంది. గోదావరి వరదల వల్ల ప్రభావితమయ్యే జిల్లాలలో 42 మండలాలు 458 గ్రామాలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయని వెల్లడించింది. జులై 28 రాశిఫలాలు.. ఈ రాశులవారికి ధనయోగం అధికారులు అలర్ట్ గా ఉన్నారని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. సహాయచర్యల్లో 3ఎన్డీఆర్ఎఫ్ , 4ఎస్డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొంటున్నాయని, క్షేత్రస్థాయిలో ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారని గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వెల్లడించారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు గోదావరి నది వరద పరిస్థితులపై ట్విట్టర్ వేదికగా అప్డేట్ ఇస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



## ఆగస్టు 3 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్ : ఆగస్టు నెల 3 వ తేదీ నుంచి రాష్ట్ర శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల జులై 31న (సోమవారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర కేబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఈ సందర్భంగా.. దాదాపు 40 నుంచి 50 అంశాల మీద రాష్ట్ర కేబినెట్ చర్చించనున్నది. ఇందులో భాగంగా..భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో సంభవించిన వరదలు, ప్రభుత్వ చర్యలపై కేబినెట్ సమీక్షించనున్నది. రాష్ట్రంలో వ్యవసాయ సాగు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో.. అకాల వర్షాల వల్ల వ్యవసాయ రంగంలో తలెత్తిన పరిస్థితులను అంచనా వేస్తూ అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై కేబినెట్ చర్చించనున్నది. రాష్ట్రంలో ఉధృతంగా కురిసిన వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లి రోడ్లు తెగిపోవడం, రవాణా మార్గాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయనున్నది. అందుకు యుద్ధప్రాతిపదికన రోడ్లను తిరిగి పునరుద్ధరించడం కోసం చేపట్టనున్న చర్యలపై కేబినెట్ చర్చించనున్నది. అదే సందర్భంలో..ఆర్టీసీ సంస్థకు సంబంధించిన అంశాలపై కేబినెట్ చర్చించనున్నది. ఆర్టీసీ ఉద్యోగులకు జీతభత్యాల పెంపు తదితర అంశాలపై చర్చించి కేబినెట్ తగు నిర్ణయం తీసుకోనున్నది.

# అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు - ప్రియాంక గాంధీ పర్యటన వాయిదా!

## మళ్లీ ఎప్పుడంటే?



హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా తెలంగాణ పర్యటన మరోసారి వాయిదా పడింది. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శనివారం (జులై 29న) తెలంగాణ పర్యటనను ఆయన రద్దు చేసుకున్నారు. అమిత్ షా తెలంగాణ పర్యటన ఎప్పుడు ఉంటుందనేది త్వరలోనే ప్రకటిస్తామని బీజేపీ వెల్లడించింది. తెలంగాణలో పార్టీ విస్తరణ పనుల్లో భాగంగా అమిత్ షా పర్యటనకు బీజేపీ నాయకులు ప్రణాళికలు సిద్ధం చేశారు. వివిధ రంగాల్లోని ప్రముఖులను కలవడంతోపాటు పార్టీలోకి పలువురు నేతలకు చేర్చుకునేందుకు వ్యూహం రచించారు. అయితే, తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటిచారు బీజేపీ రాష్ట్ర నాయకులు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత తిరిగి అగ్రనేతలను రాష్ట్రానికి రప్పించనున్నట్లుగా తెలుస్తోంది.

మరోవైపు, బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్ ఇటీవల జరిగిన అలర్లలో జైలుకెళ్లిన బాధితులను కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పరామర్శించారు. శివాజీ విగ్రహాన్ని అవమానించిన వారిని అడ్డుకుంటే తమ పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మజ్లిస్ పార్టీ అండ ఉంటే తిరిగి అధికారంలోకి వస్తామనే ఆలోచనలో బీఆర్ఎస్ ఉందని ఆరోపించారు. పోలీసు కేసులతో తమను భయపెట్టాలని చూస్తే తాము బెదిరిపోమని అన్నారు. కిషన్‌రెడ్డి వెంట దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు కూడా బాధితులను పరామర్శించారు.

**ప్రియాంక గాంధీ తెలంగాణ పర్యటన వాయిదా....** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రా తెలంగాణ పర్యటన కూడా వాయిదా పడింది. ఇప్పటికే కొల్లాపూర్‌లో భారీ బహిరంగసభ కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు కాంగ్రెస్ నేతలు. అంతేగాక, కాంగ్రెస్ పార్టీలో జూపల్లి కృష్ణారావు ఈ సభలోనే చేరనున్నారు. జులై 30వ తేదీన ప్రియాంకా గాంధీ వచ్చేందుకు ఆమె కూడా అంగీకరించారు. అయితే భారీ వర్షాల కారణంగా ఈ సభను వాయిదా వేయక తప్పలేదు. ఆగస్టు 5వ తేదీన ప్రియాంక సభను నిర్వహించాలని నిర్ణయంచారు. ప్రియాంకా గాంధీ కొల్లాపూర్ సభ వాయిదా పడటం ఇది రెండోసారి. గతంలో గతంలో ఇరవయ్యో తేదీన సభను నిర్వహించాలనుకున్నారు.

కానీ ప్రియాంకా గాంధీ బిజీగా ఉండటంతో వాయిదా పడింది. ఈ సారి ప్రియాంకా గాంధీ సమయం ఇచ్చినా వర్షాల కారణంగా వాయిదా వేయక తప్పలేదు. కొల్లాపూర్ సభలో బలప్రదర్శన చేసేందుకు జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సభలోనే మహిళల అభ్యున్నతి కోసం ప్రియాంక గాంధీ మహిళా డిక్లరేషన్ ప్రకటించేందుకు ఏర్పాట్లు చేశారు. కొల్లాపూర్ సభలో పెద్ద ఎత్తున చేరికలకు కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు రాజేష్‌రెడ్డి, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత తదితర అనేక మంది నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.

# అవిశ్వాసంలో ట్విస్టులు

## కేంద్రానికి టీడీపీ, బీజేడీ, బీఎస్పీ హ్యాండ్?



కేంద్ర ప్రభుత్వం మణిపూర్ విషయంలో అనుసరిస్తున్న వైఖరిపై ప్రధాని మౌనాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ లోక్ సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీసు ఇచ్చింది. దీన్ని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఆమోదించారు. త్వరలో అన్ని పార్టీలతో చర్చించి అవిశ్వాస తీర్మానంపై చర్చ, సమయం ఖరారు చేస్తానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో వైసీపీ అందరి కంటే ముందు ఎన్డీయే సర్కార్ పై తమకు విశ్వాసం ఉందని, కాబట్టి అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించింది. అయితే గతంలో ఎన్డీయేకు పలు అంశాల్లో మద్దతుగా నిలిచిన రెండు పార్టీలు మాత్రం ఈసారి అంత సులువుగా మద్దతునిచ్చేందుకు ముందుకు రావడం లేదు. దీనికి ప్రధాన కారణం వచ్చే ఏడాది జరిగే ఎన్నికలే. ఈ ఎన్నికల్లో ఒక వేళ బీజేపీ ఓడిపోతే తమ పరిస్థితి ఏంటనే సందిగ్ధమే. దీంతో టీడీపీ, బీజేడీతో పాటు పలు పార్టీలు గతంలోలా ఎన్డీయేకు మద్దతు ప్రకటించేందుకు ఆలోచిస్తున్నాయి. దీంతో ఎన్డీయే కూటమికీ, ఇండియా కూటమికీ మధ్య ఉంటున్న ఈ పార్టీలు చివరి నిమిషంలో ఏం చేస్తాయన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. లోక్ సభలో టీడీపీకి ముగ్గురు ఎంపీలున్నారు. అలాగే ఒడిశాలో అధికార బీజేడీకి 12 మంది ఎంపీలున్నారు. ఈ రెండు పార్టీలు అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చినా, ఇవ్వకపోయినా ఎవరికీ ఎలాంటి నష్టం లేదు. ఈ నేపథ్యంలో ఓటింగ్ కు దూరంగా ఉంటే ఎలా ఉంటుందనే దానిపై ఇరు పార్టీలు చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే గతంలో 2018లో కేంద్రంపై టీడీపీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు బీజేడీ ఓటింగ్ కు దూరంగా ఉన్న చరిత్ర ఉంది. అలాగే బీఎస్పీకి లోక్ సభలో 10 మంది ఎంపీలున్నారు. ఈ పార్టీ కూడా ఇప్పటివరకూ అవిశ్వాసానికి మద్దతుగా లేదా వ్యతిరేకంగా తమ ఎంపీలకు ఎలాంటి విప్ జారీ చేయలేదు. లోక్ సభలో బలాబలాల్ని ఓసారి పరిశీలిస్తే ఎన్డీయేకు 332 మంది ఎంపీల బలం కనిపిస్తోంది అలాగే ఇండియా పేరుతో ఏర్పాటైన విపక్ష కూటమికి 142 మంది ఎంపీల బలం ఉంది. ఈ రెండు కూటములకు దూరంగా ఉంటున్న ఎంపీల సంఖ్య 64. లోక్ సభలో ఉన్న మొత్తం సీట్లలో ఐదు ఖాళీ సీట్లను తీసేస్తే 538 ఎంపీలున్నారు. దీంతో వచ్చే వారం చర్చకు

## ఎన్నికల లెక్కలతో.. !

రానున్న అవిశ్వాస తీర్మానం భవిష్యత్తు ఏంటనేది క్లారిటీగానే ఉంది. ఇంత క్లియర్ గా ఉన్న సమీకరణాల్లో తాము ఎవరికి మద్దతిచ్చినా ఫలితంపై పెద్దగా ప్రభావం పడదు. కాబట్టి బీజేడీ, టీడీపీ, బీఎస్పీ వంటి పార్టీలు ఎటు మొగ్గుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

గరుడ వార్త



## సంపాదకీయం

# రూమర్లే నిజమవుతోన్న వేళ... త్వరలో వెయ్యినోటు?

నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్డీయే ప్రభుత్వం 2016లో పెద్దనోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉన్నఫలంగా మోడీ ఈ నిర్ణయం ప్రకటించ డంతో... నాటి నుంచీ ఈ నోట్ల రద్దు, కొత్త నోట్ల రాక వంటి విషయలకు సంబంధించి ఊహాగా ణాలు వెలువడుతూనే ఉన్నాయి. ఇందులో భాగంగా తాజాగా మరోమారు ఉన్న నోట్ల రద్దు.. కొత్త నోట్ల రాక వంటి రూమర్లు హల్ చల్ చేస్తున్నాయి. అయితే ఈ విషయాలపై పార్లమెం టులో ప్రభుత్వం క్లారిటీ ఇచ్చినా నమ్మే పరిస్థితి లేదని అంటున్నారు. కారణం... గతంలో ప్రభు త్వం చేసిన ప్రకటనలకు, తాజాగా తీసుకున్న నిర్ణయాలకూ పొంతనపేకపోవడమే. ఉదాహర ణకు రెండు వేల రూపాయల నోటు గురించి అ ది రద్దు కాబోతోందనే ప్రచారం ఓ టైం లో గట్టిగా జరిగింది. దీనిపై పలువురు పార్లమెంటేరియన్లు కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంట్లోనే అడిగారు. రెండు వేల రూపాయల నోటును రద్దు చేసే ఉద్దేశం ఉ ందా.. అంటూ ప్రశ్నించారు. అయితే అలాంటి ఉద్దేశ్యం తమకు లేదని కేంద్రం స్పష్టం చేసింది. అయితే అందుకు పూర్తి వ్యతిరేకంతా కొన్ని రొజుల క్రితం కేంద్రం రెండు వేల రూపాయల నోట్లను వెనక్కు తీసుకుంటున్నట్టుగా ప్రకటించింది. ప్రస్తుతం ఆ నోట్లను వెనక్కు తీసుకోవడానికి గడు వు సమయం కొనసాగుతూ ఉంది. పార్లమెంట్ లోనేమో రెండు వేల నోటును రద్దు చేసే ఉద్దేశం లేదని చెప్పింది.. ఆ తర్వాత కొన్నాళ్లకు రద్దు ప్రకటన చేసింది. దీంతో నోట్ల రద్దు విషయంలో పుకార్లకు విలువ పెరిగింది. పార్లమెంటులో కేం ద్రం ఇచ్చే సమాధానాల్లో నిజం లేదని... కొన్ని సార్లు ఈ రూమర్లే నిజం అవుతున్నాయని పలువు రు ఈ విషయంతో క్లారిటీకి వచ్చేశారు. సరిగ్గా ఈ సమయంలో వెయ్యి నోట్లు రాబోతున్నాయి.. ఐదొందల నోట్లు రద్దవబోతున్నాయనే రూమర్లు రావడం మొదలయ్యింది. అవును... డీమానిటైజే షన్ ముందు మారకంలో ఉన్న వెయ్యి రూపాయల నోటు మరలా రాబోతుందని.. ఐదువందల నోట్ల రద్దు గురించిన ఆలోచన కేంద్రం వద్ద ఉందని అంటున్నారు. అయితే ఐదువందల నోటు రద్దు విషయంలో కాస్త అటు ఇటుగా ఉన్నప్పటికీ... వెయ్యి నోట్లు మారకంలోకి తెచ్చే విషయంలో మత్రం కన్ ఫాం గా నిర్ణయం తీసుకోబోతోందని రూమర్లు వస్తున్నాయి. ఇదే సమయంలో అలాంటిదేమీ లేదని అంటోంది కేంద్రం. గతంలో రెండువేళ నోట్ల మాదిరిగానే అలాంటి ఉద్దేశ్యం తమకు లేదని చెబుతోంది. దీంతో... వెయ్యి రూపాయల నోటును తిరిగి తీసుకు వచ్చే ఉద్దేశం ప్రస్తుతానికి లేదని.. ఐదు వందల రూపాయల నోటును రద్దు చేసే ఉద్దేశం లేదని చెప్పింది. దీంతో... కేంద్రం పార్లమెంటులో చెప్పిందంటే అందుకు వ్యతిరేకంగా జరిగే ఛాన్స్ ఉందని... రెండు వేల నోట్ల రద్దు విషయంలో జరిగింది ఇ దే అని... వెయ్యి నోట్లు వచ్చే ఛాన్స్ అయితే కచ్చితంగా ఉందని అంటున్నారు. మరి నిజంగానే ఐదొందల నోటు రద్దు చేస్తుందా.. వెయ్యి నోటు తెరపైకి తెస్తోందా.. ఎన్నికలు సమీపిస్తోన్న వేళ కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోంది అనేది ఆసక్తిగా మారింది. కాగా... ఎన్డీఏ ప్రభుత్వం 2016లో పెద్దనోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రకటించిన కొన్ని గంటల్లోనే రూ.5,000 కోట్ల విలువైన 15 టన్నుల బంగారం విక్రయాలు జరిగాయని అప్ప ట్లో కథనాలొచ్చాయి. బ్యాంకులు, ఏటీఎంల నుం చి డబ్బు తీసుకోవడానికి జనం ఎగబడ్డారు. ఈ రద్దీలో 150 మంది మరణించారు. అయితే కేంద్రంమాత్రం... తన నిర్ణయం నగదు రహిత, అవినీతి రహిత సమాజాన్ని సృష్టిస్తుందని.. స్వల్ప కాల కష్టాలు దీర్ఘకాల ప్రయోజనాలను కలిగిస్తా యని చెప్పుకొచ్చింది. చివరకు జరిగిందేమిటీ అంటే.. పాత నోట్లను కొత్త నోట్లలోకి మార్చుకోవడమే అనే విమర్శలు అప్పట్లో బలంగా వినిపించాయి.. ఇప్పటికి కూడా వినిపిస్తున్నాయి!!

# అడ్డుకట్ట పడేనా?




జగిత్యాల : గంజాయి సాగు, సరఫరాపై కఠిన చర్యలు తీసుకుని అడ్డుకట్ట వేయాలని పోలీసుల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా గుట్టు చప్పుడు కాకుం డా గంజాయి అక్రమ రవాణా, అక్కడక్కడా సాగు కూడా జరుగుతోంది. జిల్లాలో గంజాయి రవాణా అడ్డుకట్ట వేయడంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఏ మేరకు సఫలీకృతం అవుతారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నెల 28వ తేదీన హైద్రాబాద్‌లో సీఎం కేసీఆర్ పోలీసు, ఎక్సయిజ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశా లు జారీ చేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ ఇతర మాదక ద్రవ్యాల వాడకాన్ని సమూలంగా నిలిపివేయాలని, గంజాయి సాగు చేసే గ్రామా లకు రైతుబంధు, సబ్సిడీలు బంద్ చేయాలని, డ్రగ్స్‌ఫ్రీ గ్రామాలకు ప్రత్యేక ఫండ్స్, ప్రోత్సాహకాలు ఇవ్వాలని, డ్రగ్స్ దందా చేసేవారిపై పీడీయాక్టు, కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ధేశం చేశారు. డ్రగ్స్ కంట్రోలు చేయడంలో చురుకుగా వ్యవహరించిన అధికారులకు ఆగ్జిలరీ ప్రమోషన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీంతో ఎక్సైజ్ పోలీసు అధికారుల దృష్టి డ్రగ్స్ కంట్రోల్ చేయడంపై పడింది. ప్రత్యేక కార్యాచ రణ రూపొందించుకొని ముందుకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇరత రాష్ట్రాల నుంచి సరఫరా

జగిత్యాల జిల్లాకు పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి జోరుగా రవాణా అవుతోంది. ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి నిజామాబాద్, నిర్మల్, అదిలాబాద్ మీదుగా జగిత్యాల జిల్లాకు గుట్టుచప్పుడు కాకుండా రవాణా అవుతుందన్న ఆరోపణలున్నాయి. ఎవరికీ అనుమానం రాకుండా డబ్బాలలో నింపి రవాణా చేస్తున్నారని తెలుస్తోంది. గంజాయి నుంచి పొడి వేరు చేసి డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు అనుమానాలున్నాయి. నాణ్యతను బట్టి గ్రాముకు రూ. 500 నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇతర జిల్లాలు, రాష్టాలకు చెందిన కొంత మంది వ్యక్తులను నియమించుకొని వారితో అక్రమ వ్యాపారం, రవాణా చేయిస్తున్నారు.

జిల్లాలో గంజాయి కేసులు

జిల్లాలో గడిచిన మూడేళ్లలో గంజాయి కేసులు జోరుగా నమోదయ్యాయి. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో మూడేళ్లలో 25 గంజాయి కేసులు నమోదయ్యాయి. ఇందులో 68 మందిని పోలీసులు అరెస్టు చేశారు. 44.365 కిలో గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. ఇందులో 2019 సంవత్సరంలో 3 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్టు చేయగా, వీరి వద్ద 4.200 కిలో గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. 2020 సంవత్సరంలో 8 కేసులు నమోదు కాగా 18 మంది అరెస్టు అయి వీరి వద్ద 10 కిలో గంజాయి పట్టుపడింది. 2021 సంవత్సరంలో 14 కేసులు నమోదు కాగా 38 మంది అరెస్టు అయి 30.165 కిలో గ్రాముల గంజాయి పట్టుపడింది.

గంజాయి మత్తులో యువత

జిల్లాలో గంజాయి మత్తులో యువత జోగుతోంది. గంజాయి రవాణా, విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. గంజాయి లభించని సందర్భాల్లో యువత మార్కెట్‌లో రెడీమేడ్‌గా దొరికే మత్తు పదార్థాలను సేవిస్తున్నట్లు తెలిస్తోంది. ప్రధానంగా హుక్కాషాట్, బాటిల్ షాట్, ఓసీబీ పేపర్, మెడికల్ దుకాణాల్లో లభించే వైట్‌నర్ లాంటివి సేవిస్తున్నారు. దీంతో శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగిత్యాల జిల్లాకు ప్రధానంగా మంచిర్యాల, నిర్మల్, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి గంజాయి సరాఫరా అవుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసిన గంజాయిని జగిత్యాల ప్రాంతంలో కొందరు వ్యక్తులు రహస్యంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దళారులు వీటిని పాత కార్లలో స్టీరింగ్ కింద, సీట్ల కింద, స్టెపిన్ టైర్లలో, పాత స్కూటర్ల డిక్కిల్లో పోలీసులకు అనుమానం రాకుండా రవాణా చేస్తున్నారు. జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సాగవుతుందన్న ఆరోపణలున్నాయి.

అక్రమార్కులకు నేతల అండదండలు

జిల్లాలో గంజాయి, గుడుంబా, పేకాట, గుట్కా తదితర అక్రమాలలో కొందరు పలుకుబడి గల వ్యాపారులు, నేతల అండదండలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఓ అధికార పార్టీకి చెందిన నాయకునిగా చలామణి అవుతున్న వ్యాపారి ఒకరు తనకున్న పరిచయాలతో అక్రమ వ్యాపారులకు సహకారం అందిస్తు న్నట్లు విమర్శలున్నాయి. ప్రతి నిత్యం పోలీసు అధికారుల చుట్టూ, ఠాణాల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేసుకుంటున్న కొందరు వ్యక్తులు అక్రమ వ్యాపారాలకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతోనైనా జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగానికి అడ్డుకట్టపడుతాయా, లేదా అన్నది వేచి చూడాల్సిందే.

# కార్మికక్షేత్రంలో పరుచుకున్న పచ్చదనం

ఆదిలాబాద్ :సింగరేణి కార్మిక కుటుంబాలు నివసించే ప్రాంతాల్లో పచ్చదనం పరుచకపోయింది. ఒక్కొక్క మొక్క నాటి గోలేటిని హరిత తోరణంలా తలపించే విధంగా తీర్చిదిద్దారు. అందుకే ఓ చక్కటి నినాదం ఉంది. అదే సృష్టిలో మనిషి తలుచుకుంటే సాధించనిది ఏమి లేదన్నట్లుగా ఇక్కడ నల్ల నేలలో పచ్చదనం అందాలు కన్పిస్తుంటాయి. ఒకప్పుడు వృథాగా ఉన్న నేలలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి ఏరియా సింగరేణి ప్రాంతంలో ఎక్కడ చూసిన హరిత తోరణాలతో స్వాగతం పలుకుతాయి. యాజమాన్యం పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనగడ సాధ్యమన్న విషయాన్ని గ్రహించి లక్షల సంఖ్యలో మొక్కలు నాటి వృక్షాలుగా మార్చారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్యానవనాలు ఏర్పాటు చేసి ప్రజానీకనానికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తుంది. కాలుష్య నివారణతో పాటు కార్మిక కుటుంబాలు ఆహ్లాదకరం.. ఆనందాన్ని పొందుతున్నారు.

పచ్చని చెట్లు పకృతి అందాల ఉద్యానవనం

గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉద్యానవనం పచ్చని చెట్లతో నిండుకపోయింది. రకరకాల మొక్కలతో పాటు సువాసన వెదజల్లే పూల మొక్కలు సందర్శకులను ఆకర్శించే విధంగా ఏర్పాటు చేసిన మొక్కలు చూస్తే చాలు కాసేపు సేద తీరాలన్పింస్తుంది. ఉ ద్యానవనంలోకి కాలుమోపగానే పచ్చని చెట్లు, ఆహ్లాదకర వాతావరణం స్వాగతం పలుకుతాయి. నిత్యం చిన్న పిల్లలతో పాటు పెద్దలు కాలక్షేపం కోసం అలా పార్కుకు వస్తుంటారు. ఎత్తైన చెట్లను ముచ్చటించే పూలను చూస్తే ఇలా పులకరింపజేస్తాయి. హరితహారాన్ని సంరక్షించుకోవడానికి సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించి, కాంట్రాక్టు కార్మికులతో పని చేయిస్తుంటుంది. కార్మిక వాడల్లో మధ్యలో ఉన్న ఉద్యానవనం పచ్చదనంతో నిండిపోయింది.

శుభాకార్యాలకు వచ్చే

గోలేటిలోని సీఈఆర్ క్లబ్, షటిల్ కోర్టు, ఆఫీసర్ క్లబ్, గెస్టు హౌజ్, కార్మికుల క్వార్టర్లు పచ్చని చెట్లతో ఆకర్శిస్తాయి. క్లబ్‌లలో శు భాకార్యాలయాలు చేసుకునే వారికి ఆహ్లాదకరమైన వాతావరణంతో పలుకరిస్తాయి. సీఈఆర్ క్లబ్‌లోకి వెళ్లే ముఖ ద్వారం వద్ద నుంచి మొదలుకొని భవనంలోకి వెళ్లే వరకు ఇరువైపుల పచ్చని చెట్లు చక్కటి నీడ ఇస్తాయి. పంక్షన్‌కు వచ్చే అతిథులకు మంచి అనుభూతిని అందించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నింపుతుంది. ఏది ఏమైన ప్రతి ఒక్కరూ పర్యావర పరిరక్షణ కోసం మొక్క నాటినప్పుడే మానవళికి మనుగడ ఉంటుందనే ఆలోచన గోలేటి కార్మిక వాడల్లో కనబడుతుంది. సింగరేణి డిస్పెన్సరీ, కార్మిక వాడల్లో రహదారికి ఇరువైపుల పెరిగిన చెట్లు చక్కటి వాతావరణాన్ని అందిస్తున్నాయి. రెండేళ్ల క్రితం శ్రీ భీమన్న ఆలయానికి వెళ్లే రహదారి పక్కన మొక్కలు నాటారు. అవి భవిష్యత్తులో వృక్షాలుగా మారి, భక్తులకు నీడను అందించనున్నాయి.

గోలేటిలోని కోదండ రామాలయం ఆవరణలో ఉన్న చెట్లు చల్లటి నీడతో పాటు మంచి వాతావరణాన్ని అందిస్తాయి. నిత్యం మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులు, పూజల అనంతరం కాసేపు చెట్ల కింద సేద తీరుతుంటారు. పచ్చని మొక్కలతో మానవళికి మనుగడ అన్న విషయం మర్చిపోవద్దు అనే విధంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు.

జీఎం కార్యాలయం ఆవరణలో..

గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణ పచ్చని చెట్లతో నిండిపోయింది. జీఎం కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు వస్తున్న ఉద్యోగులకు చల్లటి వాతావరణాన్ని అందించేందుకు చెట్లను పెంచుతున్నారు. జీఎం కార్యాలయం ముందు భాగమే కాకుండా ప్రాంతమంతా సంచరించుకపోయింది. ఎండలో వచ్చే ఉద్యోగులు కాసేపు చెట్ల కింద సేద తీరిన తర్వాతే కార్యాలయానికి వెళ్లాలనే అనే ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం లభిస్తుంది. ఎక్కడ చూసిన పచ్చని శోభతో ఉద్యానవనంలా తలపించేలా దర్శమిస్తుంది. జీఎం బి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో ఈ ఏడాది మరిన్ని పూల మొక్కలు పెంచుతున్నారు.

# సింగరేణి.. యువ బాణీ

గోదావరిఖని : సింగరేణిలో నవతరం ఉరకలెత్తుతోంది.. ఏడేళ్లలో 16 వేల మంది కొత్త ఉద్యోగులు చేరారు.. పాతికేళ్లుగా ఉద్యోగ నియామకాలు నిలిపివేసిన సింగరేణి పాతతరం కార్మికులతోనే పనులు చేపట్టింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వారసత్వ ఉద్యోగాలతో పాటు ప్రతిభ ఆధారంగా నియామకాలతో సింగరేణి యువతరంతో నిండిపోయింది. సింగరేణిలో ప్రస్తుతం 42,534 మంది పనిచేస్తుండగా ఇందులో 16,042 మంది యువకులే ఉన్నారు. వీరంతా 40 ఏళ్ల లోపు వారే. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు యువరక్తం సింగరేణికి భవిష్యత్తులో సేవలందించే అవకాశం ఉంది. కనీస విద్యార్హత లేకుండానే సింగరేణిలో పనులు చేసే కార్మికులున్న స్థాయి నుంచి ఉన్నత విద్యావంతులు కూడా చేరి విధులు నిర్వర్తిస్తున్నారు. సింగరేణి సంస్థ 1995 నుంచి నియామకాలు నిలిపివేసింది. పాతికేళ్లుగా ఒక్క నియామకం చేపట్టలేదు. పదేళ్ల క్రితం వరకు సింగరేణిలో 50 ఏళ్లు దాటిన వారే ఎక్కువగా ఉన్నారు. చాలా మందికి కీళ్ల నొప్పులు.. ఎముకలు అరగడం లాంటి సమస్యలతో ఇబ్బంది పడుతూ విధులు నిర్వహించేవారు. చాలా మంది కార్మికులు మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ అయి తమ వారసులకు ఉద్యోగాలు పెట్టించారు. దీంతో సింగరేణిలో ఏడేళ్లలో ఒక్కసారిగా యువ ఉద్యోగులు పెరిగారు.

ఉన్నత విద్యావంతులు : సింగరేణిలో ప్రస్తుతం ఎక్కువ శాతం మంది ఉన్నత విద్యావంతులు సంస్థలో పనిచేస్తున్నారు. కొత్తగా చేరిన వారంతా ఉన్నత విద్యను అభ్యసించినవారే. ఇందులో మహిళా ఉద్యోగులు కూడా ఉన్నారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారంతా ఇంజినీరింగ్, ఎంబీఏ, పీజీ, డిప్లొమా, ఐటీఐ విద్యావంతులు ఎక్కువ శాతం మంది ఉన్నారు. సింగరేణిలో ప్రస్తుతం 'తట్టా చెమ్మస్' విధానం లేకపోవడంతో యువ ఉద్యోగులు ఎక్కువ శాతం చేరేందుకు ముందుకొస్తున్నారు. తండ్రుల వారసత్వంగా ఉపాధి పొందేందుకు మొగ్గు చూపుతున్నారు. భూగర్భంలోనూ యంత్రాల ద్వారానే పనులు చేపడుతుండటంతో సులభతరంగా మారింది. సింగరేణిలో ఒక దశలో కనీస అక్షరాలు కూడా తెలియని కార్మికులు పనిచేశారు. వేలిముద్ర వేసి వేతనాలు తీసుకునే స్థాయిలో సింగరేణిలో పనిచేశారు. దీంతో సింగరేణి యాజమాన్యం కార్మికులకు చదువు నేర్పించేందుకు గనులపై అక్షరాభ్యాసం చేయించారు. కాలనీల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం అందులోంచి బయటకు వచ్చిన సింగరేణి యువ ఉద్యోగులతో నిండిపోయింది. మరిన్ని కొత్త నియామకాలుసింగరేణిలో మరిన్ని ఖాళీలను భర్తీ చేసేందుకు కొత్త నియామకాలు చేపట్టనుంది. 2014 నుంచి ఇప్పటి వరకు 58 నోటిఫికేషన్‌లను విడుదల చేసి బయటి వారిని భర్తీ చేసుకున్న సింగరేణి మరికొన్ని ఖాళీలను భర్తీ చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇదివరకు సాంకేతిక ఉద్యోగులు, సంక్షేమ అధికారులు, క్లరికల్ ఉద్యోగులను విద్యార్హతల ఆధారంగా చేర్చుకుంది. వీరితో పాటు కారుణ్య నియామకాల ద్వారా వారసులకు సంస్థలో ఉద్యోగాలు కల్పించింది. కొత్తగా ఏర్పడ్డ ఖాళీలను మరోసారి నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేపట్టనుంది.

# విద్యార్థుల భోజనంపై ఫోకస్

నిర్మల్: గతవారం రోజుల నుంచి పలు విద్యాసంస్థల్లో అక్కడి విద్యార్థులకు అందించే భోజనాలు వికటిస్తున్న సంఘటనలపై సంబ ంధిత ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. పొరుగుజిల్లాల్లోని విద్యాసంస్థల్లో కూడా ఆహారం వికటించి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్న నేపథ్యంలో యంత్రాంగమంతా ఇటువైపే ఫోకస్ పెట్టింది. జిల్లాలోని ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీలో గత రెండు, మూడు రోజుల నుంచి విద్యార్థులకు అందించే భోజనంలో కప్పలు, బొద్దింకలు లాంటి వాటి అవశేషాలు బయటపడిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనల కారణంగా ట్రిపుల్ ఐటీ విద్యార్థులు అక్కడి హాస్టల్‌లో భోజనం చేసేందుకు జంకుతున్నారు. ఈ వ్యవహారం ఇలా కొనసాగు తుండగానే ఉ మ్మడి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు ఆసుపత్రుల పాలైన సంఘటనలు వెలుగు చూశా యి. ముఖ్యంగా కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్‌లతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న భోజనం నాణ్యత లేకుండా ఉం టోందన్న ఆరోపణలున్నాయి. ఇలా నాణ్యత లేని ఆహారం తింటూ విద్యార్థులు తీవ్రఅస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలుప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ ఇలా ఆహారం వికటించి అస్వస్థతకు గురైన సంఘటనలు వరుసగా వెలుగుచూస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అలర్ట్ అవుతున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో వెలుగుచూస్తున్న సంఘటనలపై విచారణ జరిపేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక అధికారులను విచారణ కోసం రంగంలోకి దించింది. అలాగే కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలతో పాటు జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఆ భోజనం కోసం ఉపయోగించిన ఆహారదినుసుల నాణ్యతను పరిశీలించేందు కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. సంబంధిత హెడ్మాస్టర్‌లకు సైతం జిల్లా విద్యాశాఖ అధికారి ఇప్పటికే మధ్యాహ్న భోజనంకు సంబందించి మార్గదర్శకాలను జారీచేశారు. ప్రతిరోజూ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం కోసం ఓ టీచర్‌ను ఇన్‌చార్జీగా నియమించాలని అలాగే హెడ్మాస్టర్‌లు మధ్యాహ్న భోజనంకు సంబందించి వంట మొదలైనప్పటి నుంచి పిల్లలు తినే వరకు పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి ఇప్పటికే హెడ్మాస్టర్‌లందరికి సూచనలు జారీ చేశారు. అలాగే ఆకస్మిక తనిఖీలకు సంబంధించి ప్రత్యేకబృందాలు రంగంలోకి దిగబోతున్నా యన్న సంకేతాలను సైతం హె డ్మాస్టర్‌లకు అందించారు. మధ్యాహ్న భోజనంలో వినియోగించే కూరగాయలను శుభ్రం చేయాలని అలాగే పిల్లలందరు తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కునే విధంగా ఉ పాధ్యాయులు చూడాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు ఎప్పటికప్పుడు బియ్యం, వంటసామాగ్రి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. భోజనం తరువాత బడి పిల్లలను పరిశీలించాలంటూ కూడా అధికారులు తమ ఆదేశాల్లో సంబందిత హెడ్మాస్టర్‌లను కోరారు. వరుస సంఘటనలతో హై అలర్ట్‌కాగా రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ఉమ్మడి జిల్లాలో కూడా చోటు చేసుకుంటుండడంతో సంబంధిత అధికారులంతా అలర్ట్ అవుతున్నారు. ముఖ్యంగా కస్తూరిభా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అక్కడి ప్రత్యేక అధికారులకు మధ్యాహ్న భోజనంపై నిర్ధిష్టమైన మార్గదర్శకాలను అందిస్తున్నారు. దీంతో పాటు సెక్టోరియల్ అధికారులను కూడా అప్రమత్తం చేసి ఆకస్మిక తనిఖీలతో పాటు నిరంతర తనిఖీల కోసం షెడ్యూల్‌ను రూపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశిం చారు. రెసిడెన్షియల్‌స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సంబంధిత ప్రిన్సిపాల్, హెడ్మాస్టర్‌లు మధ్యాహ్న భోజనంను పకడ్బందీగా చేపట్టాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎలాంటి సంఘటనలు జరి గినా సంబంధిత ప్రిన్సిపాల్, హెడ్మాస్టర్‌లదే బాధ్యత అవుతుందని అలాగే ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఇన్‌చార్జీ కూడా బాధ్యత వహించాల్సి వస్తుందంటూ ఆదేశాలు వెలువరించారు. రంగంలోకి ప్రత్యేక బృందాలుజిల్లావ్యాప్తంగా కస్తూరిభా పాఠశాలలతో పాటు రెసిడెన్షియల్, మండ ల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనం పథకంను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు సమాచారం. ఈ మేరకు ఈ బృందాలను మండలాల వారీగా నియమిం చారంటున్నారు. ఆకస్మిక బృందాలు మధ్యాహ్నభోజనం కోసం వినియో గిస్తున్న కూరగాయలను, ఇతర ఆహార దినుసులను అలాగే మధ్యాహ్న భోజనం చేసే వంటగదుల వద్ద ఉన్న వాతావరణాన్ని పరిశీలించను న్నారు. అలాగే పిల్లలు భోజనం చేసే సమయంలో ఎలాంటి పరిశు భ్రతను పాటిస్తున్నారోననే అంశాన్ని కూడా వీరు గమనించనున్నట్లు చెబుతున్నారు. తాగునీరు విషయంలోనూ, వంట పాత్రల శుభ్రత విషయంపై కూడా వీరు తెలుసుకోనున్నారు. తమ తనిఖీల్లో లోపాలు వెలుగుచూస్తే సంబంధిత పర్యవేక్షకులపైనే చర్యలు తీసుకుంటామంటూ కూడా హెచ్చరికలు జారీచేస్తున్నారు. ఆకస్మిక బృందాలు ప్రతిరోజూ తమకు కేటాయించిన మండలాల్లో కనీసం నాలుగైదు పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు సమాచారం. దీనికోసం గాను స్పెషల్‌డ్రైవ్ ను చేపట్టబోతున్నట్లు విద్యా?శాఖ అధికారులు పేర్కొంటున్నారు. బాసర ట్రిపుల్ ఐటీ ఘటనతో అప్రమత్తం బాసర ట్రిపుల్‌ఐటీలో వరుసగా చోటు చేసుకున్న సంఘటనలపై కూడా జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీ హాస్టల్‌లో విద్యార్థులకు అందించే ఆహారం కలుషితమైందే కాకుండా ఆ ఆహారంలో కప్పలు, పురుగులు వెలుగుచూసిన సంగతి తెలిసిందే. దీంతో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులందరు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఈ సంఘటనపై అంతర్గత విచారణకు ఆదేశించినట్లు సమాచారం. అలాగే ట్రిపుల్‌ఐటీ అధికారులతో జిల్లా కలెక్టర్ ఈ సంఘటనపై ఆరా తీసినట్లు తెలిసింది. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలుడాక్టర్ రవీంధర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అ?ధికారి ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటి కే అన్ని పాఠశాలలకు నాణ్యతపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేశాం. కేజీబీవీల్లో ప్రత్యేకాధికారులే మధ్యాహ్న భోజనం బాధ్యతలను పూర్తిగా పర్యవేక్షిం చాలి. అలాగే పాఠశాలల్లో సంబంధిత హెడ్మాస్టర్‌లు పకడ్భంధీగా పర్యవేక్షించాలి. అలాగే కూరగాయలను శుభ్రం చేసి వంటకు ఉప యోగించాలి. భోజననిర్వహకులకు కూడా స్పష్టమైన ఆదేశాలు అందిం చాలి. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులందరికి మధ్యాహ్న భోజన మార్గదర్శకాలపై స్పష్టమైన ఆదేశాలు అందించాం. మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతున్నాం.

# మొక్కుబడి శిక్షణ.. నిబంధనలు బేఖాతరు

కరీంనగర్: సాధారణంగా ఎవరైనా కారు కొనాలనుకుంటే ముందుగా డ్రైవింగ్ నేర్చుకోవాల్సి ఉంటుంది. వీరిలో ఎక్కువ శాతం మంది డ్రైవింగ్ స్కూళ్లను ఆశ్రయిస్తుంటారు. చాలాచోట్ల శిక్షకులు సరైన నిబంధనలు పాటించడంలేదు. బోధకులకు పైపైనే తర్ఫీదు ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో వాహనానికి నడుపుతూ వెళ్లిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిక్షణ కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ కూడా ఉండడంలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో డ్రైవింగ్ స్కూళ్ల పరిస్థితిపై కథనం.

ఏం జరుగుతుందంటే..నామమాత్రం సౌకర్యాలతో బోధక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అనుమతులు తీసుకోకుండా సరైన ప్రమాణాలు పాటించడం లేదు.స్టిమ్యులేటర్ ద్వారా శిక్షణ ఇచ్చి తర్వాత రోడ్లపైకి తీసుకెళ్లాలి. ః బోధన తరగతులు నిర్వహించాలి. ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థపై పట్టు పెంచాలి.ఒకటి, రెండు చోట్ల మినహా ఎక్కడా ఈ నిబంధనను ఆచరించడం లేదు.ప్రభుత్వం డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి చేయడంతో డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తామంటూ అవసరాన్ని అవకాశంగా మాల్చుకునే దళారులు ఎక్కువయ్యారు.

ప్రమాణాలు ఇలా..

డ్రైవింగ్ స్కూల్‌ను నడపాలంటే ఆటోమొబైల్ ఇంజినీర్, డిప్లొమా ఇన్ మెకానికల్ చేసి ఉండాలి. దీని నిర్వహణకు సంబంధిత అధికారులు లైసెన్స్ జారీ చేసిన వాహనాలే ఉపయోగించాలి. మౌలిక వసతుల ధ్రువీకరణలు తీసుకోవాలి. అభ్యాసకుల వద్ద లెర్నింగ్ లైసెన్స్ ఉండాలి. ముందు థియరీ నేర్పించి, తర్వాత గేర్లు వేయడం, ముందుకు వెనుకకు తీయడంలాంటి వాటిపై తర్ఫీదు ఇవ్వాలి. ప్రధాన రహదారి, అంతర్గత రహదారిపై ఎలా నడపాలో వివరించాలి. వారు నడిపే వాహనాలకు సంబంధించి చిన్నచిన్న మరమ్మతు ఎలా చేయాలో నేర్పించాలి. వీటిని పాటించడం పాఠశాలల ప్రాథమిక బాధ్యత. కానీ నిర్వాహకులు వీటిని విస్మరిస్తున్నారు.

నాణ్యత లేని వాహనాలు

కొందరు నిర్వాహకులు నాణ్యత లేని వాహనాలను శిక్షణ ఇచ్చేందుకు వినియోగిస్తున్నారు. శిక్షణ ఇచ్చేందుకు ఫీజులు మాత్రం వేలకు వేలు వసూలు చేస్తున్నారు. అన్ని రకాలుగా బాగున్న వాహనాన్ని ఉపయోగించాలి. కానీ చాలాచోట్ల డొక్కు వాహనాలనే వినియోగిస్తున్నారు. ఉన్న పాత కార్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. పైగా వాటికి అన్ని రకాల ధ్రువీకరణలు ఉండాలనే విషయాన్ని విస్మరిస్తున్నారు. నిర్దేశ గడువు మించిన వాహనాలను వాడుతూ లేనిపోని ముప్పును శిక్షకులే ముందుంచే ప్రయత్నం చేస్తున్నారు. ఈ తీరు మారితేనే మేలు జరగనుంది. ఆర్టీఏ అధికారులు తరచూ తనిఖీ చేయాలి. ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

మూడేళ్లకోసారి పునరుద్ధరణ

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 71 బోధక శిక్షణ కేంద్రాలు (డ్రైవింగ్ స్కూళ్లు) ఉండగా ఇందులో 62 ఎల్ఎంవీ (లైట్ మోటార్ వెహికిల్), 9 హెవీ డ్రైవింగ్ వాహనాలు నేర్పిస్తున్నాయి. మూడేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 30 డ్రైవింగ్ స్కూళ్ల కాలపరిమితి ముగిసినా రెన్యూవల్ చేసుకోలేదు. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడంలేదు. ముప్పై రోజులు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా.. ఎక్కడా ఆచరించడంలేదు. కొన్ని రోజులు ఇచ్చి వదిలేస్తున్నారు. బోధక శిక్షణ కేంద్రాలకు సంబంధించి ఆన్‌లైన్ విధానం లేకపోవడంతో రెన్యూవల్, రిజిస్టర్ కాని డ్రైవింగ్ స్కూళ్ల సమాచారం రవాణా అధికారులు వద్ద ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తనిఖీలు ముమ్మరం చేస్తాం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎల్ఎంవీ, హెవీ వెహికిల్ డ్రైవింగ్ స్కూళ్లు తప్పనిసరిగా నిబంధనల మేరకు నిర్వహించాలి. కాలపరిమితి ముగిసిన వాటిని తప్పనిసరిగా రెన్యూవల్ చేయించుకోవాలి. వాటిని పాటించకుండా శిక్షణ ఇవ్వరాదు. తనిఖీ ముమ్మరం చేస్తాం. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటాం. మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ఉప రవాణా కమిషనర్

# పేదల ప్రాణాలకు భరోసా ఏదీ?

పెద్దపల్లి : గ్రామీణులకు నిరంతర వైద్య సేవలు మిథ్యగా మారాయి. ఏదైనా ఆపదొచ్చి అక్కడికి వెళితే ప్రాణాల మీదకు వస్తోంది. సిబ్బంది నియామకంలో వైద్య శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల వైద్య సేవలు కాగితాలకే పరిమితమయ్యాయి. అన్ని చోట్ల సగం పూటే తెరుచుకుంటున్నాయి. జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి, చిన్న చిన్న రోగాలకు సరిపడా మందుల సరఫరా లేదు. రక్త పరీక్షల యంత్రాలు మూలనపడ్డాయి. తగిన బెడ్స్ (మంచాలు) సమకూర్చడం లేదు.సాయంత్రం 4 గం.లకే మూత ఉమ్మడి జిల్లాలో 24 కేంద్రాల్లో సగం పూట వరకే సేవలు అందుతున్నాయి. ఇద్దరు వైద్యులు, స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎంల నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకే మూతపడుతున్నాయి. రాత్రి వేళలో రోడ్డు ప్రమాద క్షతగాత్రులు, పురుగు మందు తాగిన వారు, పాముకాటు బాధితులు వస్తే సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, స్టాఫ్‌నర్సు వచ్చి ఇక్కడ సాధ్యం కాదని చేతులెత్తేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

పెద్దపల్లి జిల్లాలో కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, కొలనూర్, నందిమేడారంలో 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అరకొర సేవలు అందుతున్నాయి. ముత్తారంలో రక్త కణాలు పరీక్ష చేసే యంత్రం మూలనపడింది. కమాన్‌పూర్‌లోనూ ఇదే పరిస్థితి. అయిదు చోట్ల ఇద్దరు వైద్యులకు ఒక్కరే ఉన్నారు. సరిపడా స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎంలు లేరు.

కరీంనగర్ జిల్లాలో చల్లూరు, గంగాధర, శంకరపట్నం, వెల్ది, వావిలాల, వీణవంక ఉన్నాయి. వెల్ది భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం నిర్మిస్తున్నారు. శంకరపట్నం, వెల్ది, వీణవంకలో ఇద్దరు వైద్యులకు ఒకరే ఉన్నారు. ఉప ఎన్నికల సమయంలో వీణవంకలో 24 గంటల వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ నెరవేరలేదు.

జగిత్యాల జిల్లాలో రాయికల్, ధర్మపురి, పెగడపల్లి, మల్యాల, కోరుట్ల, సారంగపూర్, కథలాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ప్రాంతాల్లో నిరంతర వైద్య సేవల కోసం రోగులు నిరీక్షిస్తున్నారు. అన్ని చోట్ల ఒక్కరే వైద్యాధికారి ఉండటంతో సేవలకు విఘాతం ఏర్పడింది. సాయంత్రం 4 గంటల వరకే తెరిచి ఉంటున్నాయి. రాత్రి వేళల్లో మూతపడిన తలుపులు దర్శనమిస్తుంటాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఎల్లారెడ్డిపేటలో మాత్రం ఇంకా పీహెచ్‌సీ లేదు. బండలింగంపల్లిలో భవన నిర్మాణం పూర్తయితే సేవలు అందే అవకాశం ఉంది. అన్ని ఆసుపత్రులకు ఒక్కొక్కరే వైద్యులు ఉండటంతో సేవలకు ఇబ్బంది పడుతున్నారు. సాధారణ ప్రసవాలకు స్టాఫ్ నర్సులే దిక్కు. 29 మంది స్టాఫ్ నర్సులు 11 మంది పనిచేస్తున్నారు. ప్రైవేటు దవాఖానాలకు వెళ్తున్నారు.

వైద్య పరికరాలేవీ?ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఆరు బెడ్స్ (మంచాలు), రక్త, మూత్ర పరీక్ష చేసే పరికరాలు తప్పనిసరి. ప్రతిచోట ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో పరీక్షలు చేయడం లేదు. చెడిపోయిన పరికరాలు మరమ్మతుకు నోచుకోవడం లేదు. పరికరాలు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు నిధులు లేవు. నిధుల కేటాయింపు కోసం ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. వైద్య పరీక్షల్లో వినియోగించే రసాయన పదార్థాలు లేని పరిస్థితి. దీంతో పేదలు ప్రైవేటుకు వెళ్లి ఆర్థికంగా చితికిపోతున్నారు.

# పర్యవేక్షణ లేక.. చదువులు సాగక!



భూపాలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసే మండల విద్యాశాఖ అధికారుల కొరతతో జిల్లాలో విద్యా వ్యవస్థ కుంటుపడుతోంది. బోధనలో జిల్లా రాష్ట్రంలో చిట్టచివరన ఉండటం ఇందుకు నిదర్శనం. జిల్లాలో మొత్తం 11 మండలాలు ఉండగా ఇందులో ఒక్క మండలానికీ రెగ్యులర్ ఎంఈవో లేరు. కేవలం నలుగురు ఇన్‌ఛార్జిలే ఉండటంతో పరిస్థితి దిగజారుతోంది. జిల్లా విద్యాశాఖ పరిధిలో 540 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 469 పాఠశాలలు ప్రభుత్వ పరిధిలో ఉండగా సుమారు 30,508 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి 1335 మంది ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. వీరి పర్యవేక్షణ బాధ్యతలను గతంలో ఎంఈవోలే చూసుకునేవారు. మారిన నిబంధనల దృష్ట్యా స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకూ పర్యవేక్షణ బాధ్యతలు, జీతభత్యాల బిల్లుల మంజూరు అధికారం ఇచ్చారు. జిల్లాలో 28 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా ఇందులో సగానికిపైగా పీజీహెచ్ఎంలు లేక సీనియర్ స్కూల్ అసిస్టెంట్లే కాంప్లెక్స్ హెచ్ఎంలుగా కొనసాగుతున్నారు. ఎంఈవోలతో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు చాలా మందికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పజెప్పడంతో అదే స్థాయి హోదా కలిగిన కొందరు ఉపాధ్యాయులు వారిని ఖాతరు చేయడం లేదు. బోధన భారంతో కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఇన్‌ఛార్జుల బాధ్యతలతో ఎంఈవోలు పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. ఇదే అదనుగా ఒకరిద్దరు అక్కడా ఇక్కడా ఉన్నామంటూ తమ సొంత పనులను చక్కదిద్దుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఉపాధ్యాయుల హాజరు, బోధన తీరు, మధ్యాహ్న భోజన నిర్వహణ, సమావేశాలు, శిక్షణ వంటి పర్యవేక్షణతో పాటు కాంప్లెక్స్ హెచ్ఎంలతో సమన్వయం వంటివి ఇన్‌ఛార్జి ఎంఈవోలకు కత్తిమీద సాములా మారింది. ఒక్కొక్కరికి రెండు నుంచి ఆరు మండలాలకు ఒక ఎంఈవో ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారంటే విద్యా వ్యవస్థ ఏవిధంగా ఉందో అర్థమవుతోంది.

తేలని వివాదం..

ఎంఈవోల నియామకం విషయంలో ప్రభుత్వ పంచాయతీరాజ్ పరిధిలోని ఉపాధ్యాయుల మధ్య వివాదం నెలకొంది. ఎంఈవో పదవి తమకే ఇవ్వాలని ప్రభుత్వ యజమాన్య ఉపాధ్యాయులు కోర్టుకెక్కడం.. ఆ కేసు 2009 నుంచి ముందుకు సాగకపోవడంతో అప్పట్లో ఉన్న ఎంఈవోలే ఇప్పటికీ కొనసాగుతూ వస్తున్నారు. కొత్తవారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించే అవకాశం లేక ఉన్నవారికే అదనపు బాధ్యతలు అప్పజెప్పాల్సి వస్తోంది. ఫలితంగా ఒక్క ఎంఈవోకు రెండు నుంచి ఆరు మండలాలకు కేటాయించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

అటవీ ప్రాంతంలో అస్తవ్యస్తం

మహదేవపూర్: విద్యా సంవత్సరం ప్రారంభమై నెలన్నర కావస్తున్నా.. సర్కారు బడుల్లో ఖాళీలు భర్తీ కాకపోవడంతో బోధనకు ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని మారుమూల పల్లె అటవీ ప్రాంతంలో పనిచేయడానికి ఉపాధ్యాయులు ఆసక్తి కనబర్చడం లేదు. ఏదో రకంగా బదిలీలు, పదోన్నతులపై వేరే ప్రాంతానికి వెళ్లిపోతున్నారు. మహదేవపూర్, కాటారం, మల్హర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలతో విద్యార్థుల చదువులు సాగడం లేదు. గతేడది సైతం ఇలాంటి పరిస్థితులు ఉండగా, విద్యా సంవత్సరం అలాగే ముగిసిపోయింది. ఈ ఏడాది అదే పరిస్థితి నెలకొంది.

మహదేవపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతానికి 148 మంది విద్యార్థులున్నారు. ఒక ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం, ఐదుగురు ఎస్జీటీలు పనిచేస్తున్నారు. మూడు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహదేవపూర్ హరిజనవాడ, అన్నారం, బెగ్లూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మూడు చొప్పున ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ కాలేదు. పలిమెల మండల కేంద్రం ప్రాథమిక పాఠశాలలో తొమ్మిది ఎస్జీటీ పోస్టులకు నలుగురే పనిచేస్తుండగా ఐదు ఖాళీలున్నాయి. సర్వాయిపేట ప్రాథమిక పాఠశాలలో నాలుగు పోస్టులకు ఒక్కరే పనిచేస్తున్నారు. మూడు ఖాళీలు ఉన్నాయి.

మల్హర్‌రావు మండలం కొండంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరు పోస్టులకు ఒక్కరే ఉండగా ఐదు పోస్టులు, తాడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కాటారం మండలంలో ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు పోస్టులకు ముగ్గురే ఉన్నారు. నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలు పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయి.

మహాముత్తారం మండలం నర్సింగపూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులకు మూడు ఖాళీలుండగా, ముగ్గురే పనిచేస్తున్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి– పి.మధుసూదన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రెగ్యులర్ ఎంఈవోలు లేక పర్యవేక్షణ గాడితప్పి, విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉంది. కోర్టులోని వివాదం పరిష్కరించి, ఏ మండలంలో పని చేస్తున్న సీనియర్లకు ఆ మండల బాధ్యతలు అప్పజెప్పితేనే పర్యవేక్షణ సాధ్యమవుతుంది.

# ఎంసీహెచ్.. ప్రసవాల్లో భేష్



జనగామ : జిల్లా కేంద్రంలో 2018లో 150 పడకలతో ఏర్పాటు చేసిన మాతా, శిశు సంరక్షణ కేంద్రం వైద్య సేవల్లో మేటిగా నిలుస్తోంది.. అధునాతన వైద్య సదుపాయాలతో ప్రసూతి కాన్పులు చేయడంలో ఐదేళ్లుగా రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉంటోంది. గత ఏడాది ఎంసీహెచ్‌లో 24 గంటల వ్యవధిలో 36 మంది గర్భిణులకు కాన్పులు చేయగా, తాజాగా 31 మందికి కాన్పులు చేయడం విశేషం. కేవలం జనగామ జిల్లా పరిధిలోని 12 మండలాలే కాకుండా సిద్ధిపేట, యాదాద్రి–భువనగిరి జిల్లాలకు చెందిన కొన్ని మండలాల ప్రజలకు ఈ ఆసుపత్రి పెద్ద దిక్కుగా మారి సేవలందిస్తోంది.

రోజూ వందల సంఖ్యలో ఓపీలు..

ఎంసీహెచ్‌లో ప్రతి రోజూ 200 నుంచి 250 వరకు ఓపీలోనే గర్భిణులు పరీక్షలు చేయించుకుంటున్నారు. సోమవారం 350 మంది వరకు వస్తున్నారు.. ఇక ప్రతి రోజూ సగటున 10 కాన్పులు చేస్తున్నారు. నెలకు 300 నుంచి 350 కాన్పులను చేస్తున్నారు. అధునాతన ఆపరేషన్ థియేటర్లు, నవజాత శిశువుల కోసం ఎస్ఎన్‌సీయూ వంటి సదుపాయాలు ఉన్నాయి. ఖరీదైన టిఫా స్కానింగ్ యంత్రం కూడా అందుబాటులో ఉంది. దీంతో జిల్లా పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రులకు కాన్పుల కోసం వెళ్లడం గణనీయంగా తగ్గింది. జనగామ, సిద్ధిపేట, యాదాద్రి జిల్లాల నుంచి కాన్పుల కోసం ప్రతి రోజూ వందల సంఖ్యలో వస్తున్నారు.

డీఎంఈ నుంచి వైద్య నిపుణుల రాక

జనగామలో జిల్లా ఆసుపత్రి, ఎంసీహెచ్ ఆసుపత్రి జనగామ వైద్య కళాశాల పరిధిలో చేరాయి. త్వరలో ప్రారంభం కానున్న వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థులకు తరగతులు బోధించడం, ఆసుపత్రుల్లో వైద్య సేవలందించడానికి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నుంచి ప్రొఫెసర్ స్థాయి వైద్యులు జనగామలో అందుబాటులోకి వచ్చారు. గతంలో ఎంసీహెచ్‌లో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో పని చేసిన గైనకాలజీ వైద్యుల స్థానంలో డీఎంఈ నుంచి ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి గైనకాలజీ, పిల్లలు, మత్తు వైద్యులు ఎంసీహెచ్‌లో సేవలందిస్తున్నారు. ఆసుపత్రిలో మరో 100 పడకలను పెంచారు. ప్రస్తుతం ఆరుగురు గైనకాలజీ వైద్యులు ఎంసీహెచ్‌లో అందుబాటులో ఉన్నారు.

సాధారణ కాన్పులపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంసీహెచ్‌లో సాధారణ కాన్పులపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే 60 శాతం సాధారణ కాన్పులు జరుగుతుండగా, 40 శాతం సిజేరియన్ కాన్పులు చేస్తున్నారు. ఆసుపత్రిలో ప్రత్యేకంగా మిడ్‌వైఫరీ నర్సుల సేవలు ప్రారంభించారు. వీరంతా మొదటి కాన్పు కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగంలో శారీరక కసరత్తులు చేయిస్తున్నారు. దీంతో సాధారణ ప్రసవాలు, సుఖ ప్రసవాలు జరిగేలా గైనకాలజీ వైద్యులు చర్యలు తీసుకుంటున్నారు. వైద్య సేవలు మెరుగ్గా ఉండటంతో ఎంసీహెచ్‌కు వచ్చే వారి సంఖ్య పెరిగిపోతోంది. దీంతో ప్రసవాల ఒత్తిడిని తగ్గించడానికి త్వరలో జిల్లాలోని బచ్చన్నపేట, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ సీహెచ్‌సీల్లో ప్రసూతి కాన్పులు చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఇప్పటికే గైనకాలజీ వైద్యులు విధుల్లో చేరారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచుతున్నాం– డాక్టర్ సుగుణాకర్‌రాజు, జనగామ ఎంసీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఎంసీహెచ్ ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో ప్రతి రోజూ ప్రసవాలను చేస్తున్నాం. సాధారణ కాన్పులపై ప్రత్యేక దృష్టి సారించాం. వరంగల్ ఎంజీఎం, హనుమకొండ మెటర్నటీ ఆసుపత్రుల్లో ఉండే గైనకాలజీ వైద్యుల సంఖ్య కంటే తక్కువ మంది వైద్యులతో రికార్డు స్థాయి ప్రసవాలు చేస్తున్నాం. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగే విధంగా సేవలందిస్తున్నాం. అత్యాధునిక వైద్య వసతులు ఉన్న ఎంసీహెచ్‌కు కాన్పుల కోసం అధిక సంఖ్యలో వస్తున్నారు. వారి నమ్మకం మేరకు మెరుగైన సేవలు అందిస్తున్నాం.

# ఉపరితల గనులు జలమయం

గోదావరిఖని: సింగరేణి ఉపరితల గనులు జలమయం అయ్యాయి. దీంతో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా స్తంభించిపోయింది. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉపరితల గనుల రహదారులన్నీ బురదమయంగా మారాయి. దీంతో యంత్రాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భారీ యంత్రాలు నడిచే పరిస్థితి లేదు. కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ఉపరితల గనుల్లో భారీగా వరద నీరు చేరింది. వాటిని మోటార్ల ద్వారా తోడుతున్నా ఫలితం కనిపించడం లేదు. క్వారీల్లోకి వెళ్లేందుకు రహదారులు బురదమయంగా మారడంతో వాటిపై యంత్రాలు నడిచే పరిస్థితి లేదు. రామగుండం రీజియన్‌లోని నాలుగు ఉపరితల గనుల్లో నాలుగు రోజులుగా టన్ను బొగ్గు కూడా బయటకు రాలేదు. ఈ ప్రాంతంలోని నాలుగు ఉపరితల గనుల్లో 80 వేల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి చేస్తారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోజుకు 10 నుంచి 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే చేస్తున్నారు. రామగుండం రీజియన్‌లోని ఓసీపీ-1, 2, 3లతో పాటు జీడీకే-5 ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి వేల టన్నుల్లో ఉంటుంది. ఒక్క ఎన్టీపీసీకే రోజుకు 35 వేల టన్నుల బొగ్గును రవాణా చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యుత్తు కేంద్రాలకు రవాణా చేస్తుంటారు. సింగరేణిలోనే కీలకమైన రామగుండం రీజియన్‌లోని ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తి పడిపోవడంతో యాజమాన్యం ఆందోళన చెందుతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతో 3.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నష్టపోవాల్సి వచ్చింది. వినియోగదారుల నుంచి బొగ్గు సరఫరాకు



ఒత్తిడి ఉండటంతో అధికారులు నిల్వ బొగ్గును సరఫరా చేశారు. ప్రస్తుతం నిల్వ బొగ్గు కూడా నిండుకోవడంతో వినియోగదారులకు ఏ విధంగా సరఫరా చేయాలన్న దానిపై అధికారులు సమీక్షలు చేస్తున్నారు.

రహదారుల మెరుగుకు చర్యలు

వర్షం కురవడం ఆగిపోయిన వెంటనే రహదారులను మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మళ్లీ వర్షం కురవకుంటే యంత్రాలను నడిపించవచ్చని అధికారులు భావిస్తున్నారు. క్వారీల్లోకి వెళ్లే రహదారులు ఎక్కడా బురదగా లేకుండా ఉంటే యంత్రాలను నడిపించే అవకాశం ఉంటుంది. భారీ యంత్రాలు ముందుకు సాగాలంటే రహదారులు కొంత వరకైనా ఎండిపోయి ఉండాలి. నాలుగు రోజులుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో రహదారులు ఎండేంత పరిస్థితి కనిపించడం లేదు. మరికొన్ని యంత్రాలను ఉపరితలంలో పార్కింగ్ యార్డుల్లో నిలిపివేశారు. ఉద్యోగులు విధులకు హాజరవుతున్నా పని పరిస్థితులు అనుకూలించకపోవడంతో విధుల సమయం ముగిసే వరకు గనిపైనే ఉండి ఇంటికి రావాల్సిన పరిస్థితి.

# నగర రహదారులు... నరకానికి ఆనవాళ్లు

కరీంనగర్ :ఓవైపు వెలుగులు విరజిమ్ముతున్న ఎన్టీపీసీ, మరో వైపు సుమారు ఐదు రాష్ట్రాల రైతులకు యూరియా కొరతను తీరుస్తున్న ఎరువుల కర్మాగారం. ఈ రెండు సంస్థలకు సమీపంలోని జ్యోతినగర్ ప్రధాన రహదారి దుస్థితి ఇదీ. ఎన్టీపీసీ టౌన్‌షిప్, రామగుండం ఎరువుల కర్మాగారం, ఆర్.ఎఫ్.సి.ఎల్. టౌన్‌షిప్‌తో పాటు పరిసరాల్లోని సుమారు పది గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఎన్టీపీసీ రింగు రోడ్డునుంచి గౌతమినగర్ వరకు రహదారి నిర్మాణం చేపట్టిన బల్దియా ఎఫ్.సి.ఐ. అడ్డరోడ్డు నుంచి ఎన్టీపీసీ రింగు రోడ్డు వరకు రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదు. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణం కోసం దాదాపు ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేసినప్పటికీ పనులు మొదలు కాలేదు. రామగుండం నగరపాలక ప్రాంతంలోని ప్రధాన రహదారులు నరకానికి ఆనవాళ్లుగా మారాయి. గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అదుపు తప్పి బురదలో పడిపోతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. నగర శివారులోని నిత్యం రద్దీగా ఉండే ప్రధాన దారుల వెంట వెళ్లాలంటే వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



యైటింక్లయిన్ కాలనీ, పోతన కాలనీ, అల్లూరు, మారేడుపాక, వీర్లపల్లి, పెంచికలపేట, కమాన్‌పూర్ తదితర ప్రాంతాల ప్రజలు రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి వచ్చేందుకు ఇదే ప్రధాన రహదారి. సింగరేణి గనుల విస్తరణతో తరచూ రహదారులు మారుతుండటంతో ఆయా ప్రాంత ప్రజలు ఈ రోడ్డుపైనే ఆధారపడుతున్నారు. ఆయా ప్రాంతాల నుంచి నిత్యం అనేక మంది విద్యార్థులు ఈ దారిలోనే కళాశాలలు, విద్యాలయాలకు వెళ్తుంటారు. సుమారు ఒకటిన్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రోడ్డునకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో గుంతలు అధికమయ్యాయి. దీంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.

రామగుండం నగరపాలిక 14వ డివిజన్ ఎల్కలపల్లిగేటు కాలనీలోని రోడ్డు దుస్థితి ఇది. అసలే గుంతలమయమైన ఈ రోడ్డులో వరదనీరు చేరడంతో బురదమయమైంది. గుంతలు ఎక్కువ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరీ అధ్వానంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. సమీపంలోని సుమారు ఎనిమిది గ్రామాల ప్రజలు రామగుండం ప్రాంతానికి రావడానికి ఇదే ప్రధాన రహదారి. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ రోడ్డు నిర్మాణానికి పంచాయత్‌రాజ్ అధికారులు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినా నేటికీ ప్రయోజనం శూన్యం.

# అత్యవసర సేవలకు సుస్తీ

ములుగు : మన్యంలో అత్యవసర వైద్యసేవలకు సుస్తీ చేసింది. మరమ్మతులతో అపర సంజీవని వాహనాలు మూలకు చేరడంతో గ్రామీణ ప్రాంతమైన వెంకటాపురం, వాజేడు, మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లో ఆపద సమయంలో భరోసా కరవైంది. బాధితులు, క్షతగాత్రులను మెరుగైన చికిత్సలకు తరలించేందుకు ఏజెన్సీ వాసులపై ఆర్థికభారం పడుతోంది.

జిల్లా వ్యాప్తంగా కాలం చెల్లిన వాహనాలతోనే అత్యవరస సేవలను అందిస్తున్నారనే అపవాదు ఉంది. వైద్యఆరోగ్యశాఖకు తోడు నిర్వాహకులు సైతం చేష్టలుడిగి చూస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో 174 పంచాయతీల పరిధిలోని 350పైగా గ్రామాలకు 108 వాహనాలు సేవలందించాల్సి ఉంది. మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసినట్లు అధికారులు గణాంకాల్లో చూపుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రస్తుతం ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేటలతో పాటు తాడ్వాయి, ఏటూరునాగారంలో ప్రత్యామ్నాయ వాహనాలతో కాలం వెళ్లదీస్తున్నారు. కన్నాయిగూడెం మండలానికి చెందిన వాహనాన్ని ఏటూరునాగారం కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

ప్రైవేటు వాహనాలే దిక్కు

గోదావరి పరివాహకంగా ఉన్న గర్భిణులు, ప్రమాద బాధితులు, పేదలకు అత్యవసర సమయంలో మెరుగైన చికిత్సలకు గాను ములుగు, వరంగల్‌కు తీసుకెళ్లాలంటే 108 వాహనాలు అందుబాటులో లేని పరిస్థితి. మూడు రోజుల కిందట వాజేడు మండలంలోని ఇప్పలగూడేనికి చెందిన ఓ వ్యక్తి తీవ్రజ్వరంతో వాజేడు ఆసుపత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యులు డెంగీగా అనుమానించారు. రక్తకణాల శాతం తక్కువగా ఉండటంతో రిఫర్ చేశారు. అంబులెన్సు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాల్సి వచ్చింది.

రెండు రోజుల కిందట వెంకటాపురం మండలంలోని అబ్బాయిగూడేనికి చెందిన గర్భిణిని వెంకటాపురం సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. మెరుగైన సేవలకు తరలించాలని వైద్యులు సూచించారు. 108 వాహనం లేకపోవడంతో రూ.4వేలు చెల్లించి కారులో భద్రాచలం తరలించారు. ఇటీవల మారుమూల సీతారాంపురానికి చెందిన కుర్సం సిద్ధు జ్వరంతో



అస్వస్థతకు గురవ్వడంతో స్థానికులు జోలె కట్టి ప్రవాహం దాటించి ద్విచక్రవాహనంపై వెంకటాపురం ఆసుపత్రికి చేర్చారు. మెరుగైన చికిత్సలకు ఏటూరునాగారం రిఫర్ చేస్తున్నారు. అక్కడి నుంచి వాహనం వచ్చే వరకు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది.

మన్యంలో ఇదీ పరిస్థితి..

వెంకటాపురం కేంద్రంగా సేవలందించే 108 వాహనం పరికరాలు, బాడీ తుప్పుపట్టి పోయాయి. ఛిద్రం కావడం, నిర్వహణ కష్టంగా ఉండటంతో ఈ నెల 22న వరంగల్‌కు తరలించారు.

వాజేడు మండలానికి కేటాయించిన వాహనం మరమ్మతులకు గురవ్వడంతో రెండు నెలల కిందట షెడ్డుకు చేర్చారు. మరో వాహనం ఏర్పాటు చేయలేదు.

మంగపేట మండలానికి చెందిన వాహనం ఈ నెల 21న గోవిందరావుపేట వద్ద ప్రమాదానికి గురైంది. అనారోగ్య బాధితుడిని వరంగల్‌లోని ఆసుపత్రిలో చేర్చి తిరుగు ప్రయాణంలో ఘటన చోటుచేసుకుంది.

ఏటూరునాగారం కేంద్రంగా సేవలందించే వాహనం ఇంజిన్ పనిచేయక మూలకు చేరింది. వరంగల్‌కు తరలించిన అధికారులు మరో వాహనం ఏర్పాటులో కాలాతీతం చేస్తున్నారు.

తాడ్వాయి కేంద్రంగా సేవలందించే వాహనం ఈ ఏడాది మార్చిలో విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ప్రత్యామ్నాయ వాహనాలపైనే ఆధారపడాల్సి వస్తోంది.

త్వరలో కొత్తవి ఏర్పాటు చేస్తాం..– అల్లెం అప్పయ్య, డీఎంహెచ్‌వో

మరమ్మతులతో వాహనాలు షెడ్డుకు వెళ్లడంతో పలు ప్రాంతాల్లో సేవలకు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. ఈ పరిస్థితిపై నిర్వాహకులతో చర్చించాం. ప్రస్తుతం ఉన్న వాహనాలకు తోడుగా దాతలు అందించిన ములుగు, ఏటూరునాగారంలోని అంబులెన్సులను ఉపయోగించాలని సంబంధిత వైద్యులకు సూచించాం. త్వరలో రానున్న కొత్త వాహనాలతో సమస్య పరిష్కారం కానుంది.

# ఉన్నచోటే ఉపాధి

సిరిసిల్ల : ఒకప్పుడు నెలంతా బీడీలు చుట్టినప్పటికీ చేతికి వచ్చేది అరకొర వేతనమే. దీంతో జీవనం కష్టంగా మారేది. అదే మహిళలు దుస్తుల తయారీలో శిక్షణ పొంది స్థానికంగా నెలకొల్పిన పరిశ్రమలో ఇప్పుడు ప్రపంచ శ్రేణి వస్త్రాలు కుడుతున్నారు. దీంతో ఉన్న చోటే ఉపాధి లభించడంతోపాటు ఆదాయం మెరుగుపడటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సిరిసిల్లలోని నేత కార్మికులు, మహిళలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో మంత్రి కేటీఆర్ సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు రెండో బైపాస్ వద్ద 60 ఎకరాల్లో అపరెల్ పార్క్ ఏర్పాటు చేశారు. ఇందులో మహిళలు రెడిమేడ్ వస్త్రాలు తయారు చేసే పరిశ్రమను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికంగా ఉన్న అతివలు కుట్టు శిక్షణ పొంది ఈ పరిశ్రమలో ఉపాధి పొందుతున్నారు. సిరిసిల్ల పట్టణంతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన సుమారు 500 మంది మహిళలకు ఉపాధి లభించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇలాంటి పరిశ్రమలు ఇంకా రావాలి

ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కులో జూకీ మిషన్‌పై శిక్షణ ఇస్తున్నారంటే అక్కడికి వెళ్లాను. అక్కడ పెద్ద మిషన్ మీద పది రోజులు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. అక్కడ నేర్చుకున్నది ఇక్కడ నాకు చాలా ఉపయోగపడుతుంది. ఇక్కడ వస్త్రాన్ని కటింగ్ చేసి ఇస్తారు. దానిని మేము సెట్ చేసి కుట్టాలి. రోజుకు 20 నుంచి 30 వరకు అండర్‌వేర్‌లు కుడతాం. ఇలాంటి పరిశ్రమలు ఇంకా వచ్చినట్లయితే చాలా మంది మహిళలకు ఉపాధి కలుగుతుంది.

రూపా, అపరెల్ పార్కు, సిరిసిల్ల

నెలకు రూ.10 వేలు సంపాదిస్తున్నా

ఈ కంపెనీ రాక ముందు నేను ఇంటి దగ్గర బీడీలు చుడుతూ తీరిక దొరికినప్పుడల్లా మిషన్ కుట్టేదానిని. బీడీలు చేసి, మిషన్ కుట్టడం ద్వారా నాకు నెలకు రూ. 3 – 4 వేల వరకు సంపాదించేదాన్ని. పెద్దూరు శివారులో అపరెల్ పార్క్‌లో రెడిమేడ్ వస్త్రాలు తయారీ పరిశ్రమను నెలకొల్పడంతో ఇక్కడ శిక్షకురాలుగా చేరాను. ప్రస్తుతం నేను సూపర్‌వైజర్‌గా పని చేస్తూ నెలకు రూ.10 వేలకు పైగా సంపాదిస్తున్నాను. స్థానికంగా ఉంటూ ఉపాధి దొరకడం సంతోషంగా ఉంది.

అక్షయ, సిరిసిల్ల

పది రోజులు శిక్షణ పొందా

నేను ఇంటి దగ్గర ఉంటూ బీడీలు చుట్టేదానిని. టెక్స్‌టైల్ పార్క్‌లో మిషన్ కుట్టడంలో శిక్షణ ఇస్తున్నారంటే వెళ్లాను. అక్కడ పది రోజులు శిక్షణ పొందాను. అపరెల్ పార్క్‌లో పరిశ్రమ పారంభమైందని ఇక్కడికి వచ్చాను. ఇక్కడ కూడా శిక్షణ పొందాను. ప్రస్తుతం రెడిమేడ్ వస్త్రాలను కుడుతున్నాను. బీడీలు చేస్తే నెలకు రెండు, మూడు వేలు వచ్చేవి కాదు. ప్రస్తుతం రూ. 7,500ల వరకు వేతనం వస్తుంది.

# వికృత వనాలు!




వరంగల్ : రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలు ఎండలకు వికృతంగా మారాయి. పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నా.. కరవైన నీటి వసతి.. నిర్వహణ లేక మొక్కలు ఎండిపోతున్నాయి. నర్సంపేట పట్టణంలో వేర్వేరు వార్డుల్లో ఏడు పట్టణ ప్రకృతి వనాలు మొక్కలు ఎండిపోయి పిచ్చిగడ్డితో నిండిపోతున్నాయి.

మొక్కల ఆనవాళ్లు లేవు నర్సంపేట నుంచి ఖానాపురం వెళ్తుంటే కుడి వైపు కాలనీలోని గ్రీన్‌ల్యాండ్‌లో మొక్కలు నాటి ప్రకృతి వనంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారు. నీటి సౌకర్యం, ఆలనాపాలన లేకపోవడంతో నాటిన మొక్కలు ఆనవాళ్లు లేకుండా ఎండిపోయాయి.

స్ఫూర్తికి విరుద్ధంగా..ఇది ద్వారకపేట రోడ్డులోని 'ఫ్రీడం' పట్టణ ప్రకృతివనం: స్వాతంత్ర్య వజ్రోత్సవాల వేళ సమరయోధుల స్మారకార్థం పలు రకాల మొక్కలు నాటి బోర్ వేశారు. ట్రాక్‌లు ఏర్పాటు చేసి మధ్యలో కంకర వేశారు. రెండేళ్లు బాగానే ఎదిగినా ఆరు నెలలుగా దానిని ఎవరూ పట్టించుకోనందున మొక్కలు ఎండుతున్నాయి. పచ్చని లాన్ స్థానంలో పిచ్చి గడ్డితో నిండిపోయింది.

ఒక్క పండ్ల చెట్టూ కనిపించదు

సంజీవని అనాథ ఆశ్రమం పక్కన గ్రీన్‌ల్యాండ్‌లో పండ్ల మొక్కలు నాటి పట్టణ ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేశారు. ఇక్కడి గ్రీన్‌ల్యాండ్‌లో మామిడి, నిమ్మ, దానిమ్మ, జామ, సపోట మొక్కలను నాటి పెంచారు. మొక్కలు పడిపోకుండా పశువుల నుంచి రక్షణగా ట్రీగార్డులు, ఊత కర్రలు పాతారు. కొంత కాలంగా ఆ వనం వైపు కన్నెత్తి చూడకపోవడంతో మొక్కలన్ని ఎండిపోగా ట్రీగార్డులు, ఊత కర్రలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

నడవలేని విధంగా..ఇదీ ఖానాపురం వ్లో ప్రధాన రహదారికి ఎడమ వైపున కొత్తగా వెలిసిన కాలనీలో ఇళ్ల మధ్యన ఈ పట్టణ ప్రకృతి వనాన్ని వాకర్స్ కోసం నెలకొల్పారు. ఇదే తొలి పట్టణ ప్రకృతి వనం. వివిధ రకాల మొక్కలను నాటి పెంచారు. పాదాలకు ఆక్యుప్రెషర్ కోసం కంకర చూరతో మధ్యన నడక ట్రాక్‌లు నిర్మించారు. కొంత కాలంగా దానిని పట్టించుకోనందున పిచ్చిగడ్డితో నిండి కంచెను తలపిస్తోంది.

బండ్ల బాటగా మారి..నర్సంపేట– చెన్నారావుపేట మార్గంలో కాకతీయనగర్ ఎదురుగా వెంచర్‌లోని గ్రీన్‌ల్యాండ్‌లో వివిధ రకాల మొక్కలను నాటి చుట్టూ ఫెన్సింగ్ పెట్టారు. మొక్కలన్నీ మంచిగా పెరిగాయి. నీటి సదుపాయం లేక మొక్కలు ఎండిపోగా కొందరు ఫెన్సింగ్‌ను తొలగించి వనం మధ్యగా ఎడ్ల బళ్ల బాట ఏర్పాటు చేశారు.

తెరుచుకోని వనం

పట్టణంలోని నెక్కొండ రోడ్డులో రెడ్డి వేడుకల మందిరం ఎదుట గ్రీన్‌ల్యాండ్ ఆక్రమణకు గురి కాకుండా కొన్నేళ్ల క్రితం ఫెన్సింగ్ పెట్టి రెండో విడత హరితహారంలో వివిధ రకాల మొక్కలను నాటి పెంచారు. మూడేళ్ల కిందట పట్టణ ప్రకృతివనంగా మార్చి పూల మొక్కలు పెంచారు. సిమెంటుతో బాటలు నిర్మించారు. ఉన్న వాటిలో ఇదొక్కటే మంచిగా ఉన్నా.. రెండున్నరేళ్లుగా తెరుచుకోవడం లేదు.

# పండ్ల తోటలకు పెద్దపీట



ఖమ్మం : నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి లేకపోవటంతో వీటి ధరలు ఒక్కోసారిగా పెరుగుతున్నాయి. దిగుబడులు తగ్గటంతో విపణిలో డిమాండ్ ఏర్పడుతోంది. మరోవైపు నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో ఏటికేడు వరి సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా పండ్లు, కూరగాయల తోటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో ఉద్యానశాఖను అనుసంధానం చేస్తూ, రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగు పెంచేందుకు రాయితీలు ప్రకటించింది. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగి ఉండి, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, సన్న, చిన్నకారు రైతులంతా ఈ పథకానికి అర్హులు. బోరు లేదా బావి నీటి వసతితో పాటు 5 ఎకరాలలోపు భూమి ఉండాలి.

మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు...

పండ్ల తోటల సంరక్షణ బాధ్యతను మూడేళ్ల పాటు ప్రభుత్వమే చూసుకుంటుంది. ఎరువులకు ఒక్కో మొక్కకు రూ.50, నిర్వహణ ఖర్చుల కింద నెలకు రూ.10 చొప్పున బతికున్న ప్రతి మొక్కకు చెల్లించటంతో పాటు ఉపాధి హామీ కూలీలతో గుంతల తవ్వకం, మొక్కలు నాటే పనులు చేపడతారు. మొక్కలు నాటిన ఏడాది నుంచి మొత్తం మూడేళ్లు నిర్వహణ ఖర్చులు మంజూరు చేస్తారు.

బిందు సేద్యం పరికరాలపై రాయితీ...

జి.అనసూయ, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి, ఖమ్మం

ఈసారి కొత్తగా ఉద్యానశాఖ అనుసంధానంతో ఉపాధి హామీ పథకంలో సాగు చేసే పండ్ల తోటల పెంపకానికి బిందు సేద్యంపైనా రాయితీ కల్పించారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండి, 5 ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులు. సాగు నీటి వసతి కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలు పంపిణీ చేస్తారు.

ఒక్కో మొక్కకు చెల్లింపులు(రూ.లలో) ఇలా...

మామిడి(30), బత్తాయి(44), నిమ్మ(25), సపోట(37), జీడిమామిడి(24), సీతాఫలం(26), దానిమ్మ(24), కొబ్బరి(36), జామ(31), మునగ(15), అల్లనేరేడు(25)

# పరిశ్రమల వెల్లువ

మహబూబాబాద్ : ఒకప్పుడు పరిశ్రమ స్థాపించి ఉపాధి కల్పించాలనుకునేవారికి తమ ఆశయం నెరవేర్చుకోవడం చాలా కష్టంగా ఉండేది. పరిశ్రమ స్థాపనకు అనుమతులు పొందేందుకు ఎన్నో వ్యయప్రయాసలు పడేవారు.. తిప్పలు పడలేక మధ్యలోనే తమ ఆశయాన్ని వదిలేసేవారు. ఇప్పుడు అలాంటి లక్ష్యం..ఆశయం ఉన్న వారికి ఎలాంటి అడ్డంకులు లేవు. ఆసక్తిగల వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్టు అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం (టీఎస్–ఐపాస్) విధానాన్ని తీసుకొచ్చింది. ఇది అమలులోకి వచ్చిన తర్వాత జిల్లాలో పారిశ్రామిక రంగంలో రాణించేందుకు చాలా మంది ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా యువ పారిశ్రామికవేత్తలు ఉంటున్నారు. దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలోనే అధికారులు వాటిని పరిశీలించి నిబంధనల ప్రకారం అన్ని ఉన్న వాటికి ఎలాంటి అడ్డంకులు చెప్పకుండా అన్ని విధాలుగా విచారణ చేసి అనుమతులు ఇస్తుండడంతో ఆనందంతో పరిశ్రమలు స్థాపిస్తున్నారు. మహబూబాబాద్, తొర్రూరు, కురవి, మరిపెడ మండలాల్లో ఎక్కువగా ఉన్న ఈ పరిశ్రమలతో స్వయం ఉపాధి పొందుతూ మరి కొంత మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారు.

పరిశ్రమలు ఇవే స్పైసీ గ్రైండింగ్, రైస్ మిల్లులు, ఫౌల్ట్రీఫామ్స్, గ్రానైట్, కంకర మిల్లులు, శీతల గిడ్డంగులు, జిన్నింగ్ మిల్లులు, సోలార్ పవర్, వెల్డింగ్ దుకాణాలు

బియ్యం బస్తాలను లారీల్లోకి ఎక్కిస్తున్న ఇది కేసముద్రం మండలంలోని ఓసాయి ఆగ్రో ఇండస్ట్రీస్. 2020లో ఈ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు నిర్వాహకుడు ఎ. వేణుగోపాల్‌రెడ్డి అనుమతులు పొందడానికి వివిధ శాఖల వద్దకు వెళ్లకుండా టీఎస్–ఐపాస్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 21 రోజుల్లోనే ఆయా శాఖల అధికారులు పరిశ్రమ వద్దకు వచ్చి పరిశీలించి అనుమతులు ఇచ్చారు. దీంతో సమయం వృథా కాలేదు. ఏడాదిలోనే ప్రారంభించారు. ప్రస్తుతం 70 మందికి ఉపాధి కల్పించినట్లు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు.



టీఎస్–ఐపాస్ రాక ముందు ఒక్కో శాఖ వద్దకు తిరిగి అనుమతులు పొందడానికి రెండు, మూడు నెలల సమయం పట్టేది. ఇప్పుడు పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారికి ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులు తొందరగా అవుతున్నాయి.

నిర్మాణంలో ఉన్న ఇది మిర్చి నుంచి ఆయిల్ తీసే పరిశ్రమ. దీన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడేపల్లిగూడేనికి చెందిన 30 ఏళ్ల యువకుడు నంద్యాల శివకృష్ణ ఏర్పాటు చేస్తున్నారు. మహబూబాబాద్ ప్రాంతంలో సాగవుతున్న సన్న రకం మిర్చి నుంచి వచ్చే నాణ్యమైన ఓలియోరెసిస్ అనే ఎరుపు రంగు నూనెకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. దీంతో డోర్నకల్ మండల తోడేళ్లగూడెం వద్ద ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అనుమతులను పొందడానికి శివకృష్ణ టీఎస్–ఐపాస్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అర్జీని పరిశీలించిన పరిశ్రమల శాఖ అధికారి నెల రోజుల వ్యవధిలోనే అనుమతి ఇచ్చారు. జనవరిలో పరిశ్రమ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ పరిశ్రమ ద్వారా 30 మందికి ఉపాధి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరి కొంత మందికి ఉపాధి దొరుకుతుందని శివకృష్ణ చెబుతున్నారు.

# కార్మికులకు ఆరోగ్య భాగ్యం

సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తోంది.. సంస్థకు ప్రధాన బలం ఉద్యోగులని.. వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులపై దృష్టి సారిస్తారనే విషయాన్ని గుర్తించిన కంపెనీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. సీజనల్ వ్యాధులకు గురికాకుండా గనులపై సదస్సులు నిర్వహించి వారిలో అవగాహన పెంచుతోంది. అనారోగ్యం బారిన పడిన, ప్రమాదాల్లో గాయపడిన వారికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులు, విశ్రాంత కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ మందులు అందిస్తోంది..

నిమ్స్‌లో నేరుగా..

హైదరాబాద్‌లోని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో సింగరేణి ఉద్యోగుల కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవలే సంస్థ డైరెక్టర్(ఫైనాన్స్) బలరాం ప్రారంభించారు. ఇదివరకు సంస్థ ఉద్యోగులు, విశ్రాంత కార్మికులు నిమ్స్‌కు వెళ్తే సాధారణ రోగులతో కలిసి వేచి ఉండాల్సి వచ్చేది. ఔట్ పేషెంట్ బ్లాక్, మిలీనియం బ్లాక్, స్పెషాలిటీ బ్లాకుల్లో ప్రత్యేక కౌంటర్లు ప్రారంభం



కావడంతో రిఫర్ చేసిన ఉద్యోగులు, మెడికల్ కార్డు ఉన్న విశ్రాంత ఉద్యోగులు నేరుగా వైద్య సేవలు పొందే అవకాశాన్ని కల్పించారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులు వారి కుటుంబీకులకు అసౌకర్యం లేకుండా త్వరగా మెరుగైన వైద్యం పొందేందుకు అవకాశం ఏర్పడింది.

ఆసుపత్రుల్లో ఆధునిక పరికరాలు

సింగరేణిలో ఒక్కో కార్మికుడి సంక్షేమానికి రూ.3.10 లక్షలు వెచ్చిస్తోంది. వైద్య సేవలు అందించేందుకు యాజమాన్యం ఏటా రూ.259 కోట్లు ఖర్చు చేస్తోంది. సింగరేణి ఆసుపత్రులతో పాటు 126 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకొని అనుబంధ సేవలు అందిస్తోంది. పలు సింగరేణి ఏరియా దవాఖానాల్లో ఆధునిక వైద్య సేవలు అందించేందుకు రూ.6.25 కోట్లతో పరికరాలు కొనుగోలు చేసింది. 2డీ ఎకో పరికరాలు, సీటీ స్కాన్ విభాగాలు, కంటి పరీక్షలకు సంబంధించిన గ్రీన్ లేజర్, డిజిటల్ ఎక్స్‌రే యూనిట్లు, షుగర్ పరీక్షలకు వేగంగా హెచ్‌బీ ఏ1–సీ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫిజియోథెరపీ విభాగాలు ఏర్పాటు చేయడమే కాకుండా అత్యాధునిక లేజర్ థెరపీ యూనిట్లు, కాంబినేషన్ థెరపీ మల్టీజిమ్‌లు, సీపీఎం మిషన్లు, మజిల్ స్టిమ్యులేటర్లు వంటివి ఏర్పాటు చేసింది. వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చే ముందే ఖర్చుకు వెనకాడకుండా భూపాలపల్లి, కొత్తగూడెం, రామగుండం, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల్లో అయిదు ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది.

త్వరలోనే నియామకాలు

కంపెనీ వ్యాప్తంగా తొమ్మిది ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న ప్రత్యేక వైద్య నిపుణుల పోస్టుల భర్తీకి యాజమాన్యం చర్యలు చేపట్టింది. 25 ఉద్యోగ ఖాళీల నియామకాలకు ఏడాది కాలానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇటీవల సంస్థ ప్రధాన కార్యాలయంలో ముఖాముఖి నిర్వహించారు. త్వరలోనే మెరిట్ ఆధారంగా ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఫలితంగా సింగరేణి ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్యుల కొరత తీరి ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

సంక్షేమానికి పెద్దపీట

–బళ్లారి శ్రీనివాసరావు, సింగరేణి జీఎం

సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. వ్యాధులను బట్టి చికిత్స నిమిత్తం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో సైతం వైద్యం అందిస్తోంది. సింగరేణి దవాఖానాల్లో కూడా ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. స్పెషలిస్టు వైద్యులు కూడా కొద్ది రోజుల్లోనే ఆసుపత్రుల్లో సేవలు అందించనున్నారు.

# బల్దియా ఖజానాకు ఎసరు

జగిత్యాల : జగిత్యాల పురపాలక సాధారణ సమావేశం జరగనుంది. అయితే చేయని పనులు, అపరిష్కృత బిల్లులను ఎజెండాలో చేర్చడం మరోసారి చర్చనీయాంశమైంది. తప్పుడు బిల్లులతో పురపాలక ఖజానాను కొల్లగొట్టేందుకు వ్యూహం రచించినట్లు తెలుస్తోంది. '2021 కొవిడ్ నుంచి మొదలుకొని రెండేళ్ల వ్యవధిలో చెల్లింపులకు నోచుకోని ఎన్నో బిల్లుల్ని ఈసారి ఆమోదింపజేసుకునేందుకు రంగం సిద్ధమైంది. ఛైర్‌పర్సన్ వైదొలగడం.. శాశ్వత అధ్యక్షురాలిని నియమించకపోవడం, బల్దియాలో శాశ్వత కమిషనర్ లేకపోవడంతో కొందరు కిందిస్థాయి అధికారులు అక్రమాలకు తెరలేపారు. వీరికి కొందరు ప్రజాప్రతినిధులు కూడా సహకరిస్తుండటంతో పురపాలక ఆదాయంపై కన్నేశారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

అంతులేని అక్రమాలు

రెండు, మూడేళ్లనాటి బిల్లుల చెల్లింపులు ఇప్పుడు సభ్యులు ఆమోదం ఎందుకు పొందాల్సి వస్తుందనేది ఆలోచించాల్సిన విషయం. నిబంధనల మేరకు గతంలో ఈ పనులకు సంబంధించిన అధికారులే వీటి బిల్లుల చెల్లింపు పూర్తిచేయాలి. ఈ పనుల్లో అంతులేని అక్రమాలు జరిగాయని అప్పటి అధికారులు భావించి వీటిపై సంతకం చేయలేదు. కొందరైతే తీవ్ర ఒత్తిడితో బదిలీపైనో, దీర్ఘకాలిక సెలవులోనే వెళ్లారు. ప్రస్తుత పరిస్థితుల్లో అందరూ ఇన్‌ఛార్జులుగానే వ్యవహరించడం, పైగా కొందరి 'పెద్దల' సహకారం దొరకడంతో బల్దియాలో అంతులేని అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగం అధికారులు గుత్తేదార్లతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు, బిల్లులు చేపట్టి ప్రజాధనం కాజేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే మరిన్ని వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

ప్రధాన ఆరోపణలు కొన్ని..ఏప్రిల్ 2021లో కొవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రాల్లో టెంట్లు, కుర్చీలు ఇతర సౌకర్యాలు బల్దియా సమకూర్చినందుకు రూ.6 లక్షల మేరకు బిల్లు చేశారు. జులై 2022లో ఎజెండాకు తెచ్చారు. వీటిలో అక్రమాలున్నాయని గుర్తించిన అప్పటి కమిషనర్ స్వరూపరాణి ఈ బిల్లుపై సంతకం చేయలేదు. తాజాగా ఇదే బిల్లును రూ.6 లక్షలుగా మరోసారి చేర్చడం గమనార్హం. 2021 సంవత్సరంలో కండ్లపల్లి రోడ్డు, గోవిందుపల్లి, బైపాస్‌రోడ్డు, గణేశ్‌నగర్‌లో వర్షాలతో ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు రూ.4 లక్షలు వ్యయమైనట్లు ఎజెండాలో చేర్చారు. వాస్తవంగా క్షేత్రస్థాయిలో అప్పుడు ఎలాంటి గుంతలు పూడ్చలేదని స్థానికులు చెబుతున్నారు. 2020 సంవత్సరం హరితహారంలో భాగంగా బొంగులు కొనుగోలు చేసి మొక్కలు నాటేందుకు రూ.3 లక్షలకు సంబంధించిన బిల్లు 2022లోనే కమిషనర్ ముందుకు తెచ్చినా సాధ్యం కాలేదు. తాజాగా సభ్యుల ఆమోదం కోసం ఎజెండాలో మరోసారి తెరపైకి తెచ్చారు. అప్పటి అధికారుల హయాంలోనే చెల్లించాల్సిన ఈ బిల్లును తాజాగా మంజూరు కోరడం విడ్డూరం.

# సామాజిక ఆరోగ్యకేంద్రం ఉన్నతీకరణకు మోక్షమెప్పుడో?

జనగామ : పాలకుర్తిలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. 100 పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరణ కలగానే మిగిలింది. దీంతో మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. ఏడాది క్రితం ఈ ఆసుపత్రి వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వచ్చినా.. వైద్య సేవలు అరకొరగానే అందుతున్నాయి.

రోగుల ఇబ్బందులుఈ ఆసుపత్రి 1977లో 30 పడకల ఆసుపత్రిగా మారింది. ఆ తర్వాత ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా స్థాయిని పెంచారు. అనంతరం సామాజిక వైద్యశాలగా కొనసాగుతోంది. దీని ప్రాంగణంలో మూడేళ్ల క్రితం సుమారు రూ.10 లక్షలతో పోస్టుమార్టం గదిని నిర్మించారు. దాన్ని ఇంతవరకూ ప్రారంభించలేదు. ఆసుపత్రిలో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చి మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రికి నిత్యం చికిత్స కోసం సుమారు 120 మంది వరకు బయటి రోగులు వస్తుంటారు. రోజు సుమారు 200 మంది వస్తారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, సిబ్బంది, మందులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రజలు వరంగల్, హైదరాబాద్, జనగామ తదితర ప్రాంతాలకు వెళ్తున్నారు. వైద్యానికి రూ.లక్షలు వెచ్చిస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు. వైద్యశాలను 100 పడకలుగా మార్చి 24 గంటలు వైద్య సేవలందించాల్సిన అవసరం ఉంది.

అందని ద్రాక్షగానే అత్యవసర వైద్యం..

ఆసుపత్రిలో రోగులకు అత్యవసర వైద్యం అందని ద్రాక్షగానే మారింది.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి అత్యవసర వైద్యం అందడం లేదు.ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచిస్తుంటారు. మిగతా రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందవు. వైద్యశాలలో 8 మంది వైద్యులుండాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉన్నారు. కొన్నేళ్లుగా వైద్యుల పోస్టులను భర్తీ చేయడం లేదు. వైద్యులు స్థానికంగా ఉండకపోవడంతో రాత్రివేళల్లో వైద్య సేవలందడం లేదు. జనరల్ సర్జన్, ఫిజీషియన్, అనస్తీషియా, పిల్లల వైద్యనిపుణులు, గైనకాలజిస్టులను నియమించి మెరుగైన వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలి– రమాదేవి, పాలకుర్తి

30 పడకల ఆసుపత్రిని 100 పడకలుగా అభివృద్ధి చేయాలి. ఆధునిక పరికరాలతో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి. పాలకుర్తి దినదినాభివృద్ధి చెందుతున్నందున ఇక్కడ పెద్దాసుపత్రి ఉండాల్సిందే. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలి. అప్పుడే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

ప్రతిపాదనలు పంపించాం..– వైద్యాధికారి పాలకుర్తి ఆసుపత్రిని 100 పడకల వైద్యశాల ఆసుపత్రిగా మార్చాలని ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఆసుపత్రిలో వైద్యుల కొరతపై ప్రభుత్వం యోచిస్తోంది. త్వరలో సిబ్బంది ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తారని ఆశిస్తున్నా. ఆసుపత్రిలో నూతన బీపీ పరికరంతో పాటు గర్భిణులకు స్కానింగ్ యంత్రాన్ని అందుబా టులోకి తెచ్చాం. రక్తపరీక్షల యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

# ఉపాధిలో భేష్

భూపాలపల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశిత లక్ష్యానికంటే అధికంగా పనులు చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా 5వ స్థానంలో నిలిచింది. గ్రామీణ ప్రజలకు పనులు కల్పించడమే కాకుండా అన్నదాతలకు, గ్రామాల అభివృద్ధికి పలు పనులు చేపట్టడంలో ఉపాధి హామీ పథకం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటోంది. సొంత గ్రామంలోనే పనులు చేసుకుంటూ ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటుండంతో పనులను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు.

వంద శాతం మించి..

జిల్లాలోని 241 పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు 27.38 లక్షల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక తయారు చేసుకున్నారు. 2023 మార్చి 31వ తేదీ నాటికి లక్ష్యం కంటే అధికంగా 30.28 లక్షల పని దినాలు(118 శాతం) పనులు పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా 5వ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పనుల నిర్వహణకు సంబంధించి వెంటవెంటనే పనులకు అనుమతులివ్వడంతో లక్ష్యం పూర్తి చేయడం తేలికైందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లా ఏర్పాటైనప్పటి నుంచి లక్ష్యానికి మించి కూలీలకు పనులు కల్పించడం ఇదే మొదటిసారని అధికారులు తెలుపుతున్నారు. పనులకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బంది మూడు చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సకాలంలో ఇది జరిగేలా, వెనుకబడి మండలాలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి లక్ష్యం పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నారు.

కూలీ చెల్లింపుల్లో 6వ స్థానం

కూలీలకు నగదు చెల్లింపుల్లోనూ జిల్లా ఆదర్శంగా నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు కూలీ సగటున రూ.150 నుంచి రూ. 164.4 వరకు అందిస్తే జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాత్రం ఒకరోజు కూలీ సగటున రూ.186.50 చెల్లించారు. అలాగే ఇప్పటి వరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.56.50 కోట్లు చెల్లింపు చేశారు. ఇంకా సుమారు రూ.2 కోట్ల చెల్లింపులు చేపట్టాల్సి ఉందని.. రెండు మూడు రోజుల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.08 లక్షల జాబ్‌కార్డులు ఉండగా అందులో 2.39 లక్షల మంది కూలీలుగా నమోదు చేసుకున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1.17 లక్షల మంది ఉపాధి పనులను సద్వినియోగం చేసుకున్నారు. 773 కుటుంబాలు వంద రోజుల పని పూర్తి చేసుకున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. అత్యధికంగా భూపాలపల్లి, కాటారం, మహదేవ్‌పూర్, రేగొండ మండలాల్లో వందరోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు ఉండగా అత్యల్పంగా టేకుమట్ల, మల్హర్‌రావు, పలిమెల మండలాల్లో ఉన్నారు.

# ‘ఆరోగ్య మహిళ’కు ఆదరణ



వరంగల్ : స్త్రీల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రారంభించిన ‘ఆరోగ్య మహిళ’ సేవలకు మంచి ఆదరణ లభిస్తోంది. మార్చి 8న మహిళా దినోత్సవం కానుకగా రాష్ట్ర వ్యాప్తంగా 100 ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రతి 8 రకాల వైద్యసేవలను మహిళలకు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో గత నాలుగు వారాలలో 697 మంది మహిళలు ఆరోగ్య మహిళ సేవలు పొందగా, 52 మందిని మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం, సీకేఎం, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, హనుమకొండ జీఎంహెచ్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. హనుమకొండకు చెందిన ఓ 18 సంవత్సరాల విద్యార్థినికి ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద ఎంజీఎం వైద్యులు కార్పొరేట్ ఆసుపత్రిలో కూడా సాధ్యం కాని శస్త్రచికిత్సను నిర్వహించి బతికించారు.

గుర్తించిన సమస్యలు

మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ సంతానలేమి థైరాయిడ్ మధుమేహం రక్తపోటు రక్తహీనత మోనోపాజ్ బరువు

8 రకాల పరీక్షలు

1. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు
2. ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్
3. థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం, అయోడిన్ సమస్య, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపంతో పాటు, విటమిన్ బీ12, విటమిన్ డీ పరీక్షలు
4. మూత్రకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధుల పరీక్ష
5. మోనోపాజ్ దశకు సంబంధించిన పరీక్షలు హార్మోన్ రీప్లేస్మెంట్ థెరప్మీ, కౌన్సెలింగ్
6. నెలసరి, సంతాన సమస్యలపై పరీక్షలు అవగాహన అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు
7. శారీరక కలయిక సంబంధిత అంటు వ్యాధుల పరీక్షలు, వైద్యం
8. బరువు నియంత్రణ, యోగా, వ్యాయామంపై అవగాహన

కార్పొరేట్ ఆసుపత్రుల్లో కానిది ఎంజీఎంలో చేశారు

– సన్నూరి పూజిత, దీన్‌దయాళ్‌నగర్, హనుమకొండ

మాది హనుమకొండ హంటర్‌రోడ్డులోని దీన్‌దయాళ్‌నగర్. అమ్మానాన్నలు కూలి పని చేస్తారు. నేను సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. పుట్టుకతో తల మెదడు భాగంలో ఏర్పడిన చిన్నగడ్డ నేను పెరిగేకొద్దీ పెద్దదైంది. నాన యాకయ్య అన్ని ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లి చూపించారు. శస్త్రచికిత్స చేస్తే మీ బిడ్డ బతకదని చెప్పడంతో తాత్కాలిక మందులతో కాలం గడుపుతునన్నా. మార్చి 8న మహిళా దినోత్సవం వేళ న్యూశాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ కార్యక్రమం ప్రారంభంలో పెద్ద డాక్టర్లు వస్తున్నారని నాన్న నన్ను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను కలిసి తమ బాధ చెప్పుకున్నాం. ఆయన స్పందించి ఎలాగైనా నయం చేయాలని వైద్యులకు సూచించి ఎంజీఎంకు పంపించారు. మార్చి 15న వైద్యులు మూడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. మందులిచ్చి శనివారం డిశ్చార్జి చేశారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ఎంజీఎం వైద్యులు శస్త్రచికిత్స చేయడం నాకు ఆనందంగా ఉంది. ఎంజీఎం వైద్యులకు, ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌కు రుణపడి ఉంటాను.

మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

– డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌వో, వరంగల్

‘ఆరోగ్య మహిళ’ పథకంలో వైద్యసేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఆయా కేంద్రాలలో గుర్తించిన వారికి అవసరమైతే మెరుగైన వైద్యసేవలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోంది. జీవితాంతం సంతోషంగా జీవించేందుకు మహిళలు తప్పనసరిగా ఆరోగ్య మహిళ సేవలను పొందాలి.

# చిరు వ్యాపారుల చిరునామా ఎక్కడ



వరంగల్ : చిరు వ్యాపారులకు శాశ్వత చిరునామా చూపించడంలో నగర పురపాలక సంస్థలు వెనకబడ్డాయి. వీధి వ్యాపారుల విక్రయ కేంద్రాలు(హాకర్స్ జోన్లు) ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. నగరంలో కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో సుమారు ఐదు వేల మంది వీధి వ్యాపారులుంటారు. ప్రధాన, అంతర్గత రహదారులు, కూడళ్లు, రైల్వే, బస్ స్టేషన్ల వద్ద బిక్కు బిక్కుమంటూ వ్యాపారాలు చేసుకుంటున్నారు. నిత్యం ట్రాఫిక్ పోలీసులు, గ్రేటర్ వరంగల్ ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక విభాగాల సిబ్బంది వేధింపులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరానికి ఎవరైనా వీఐపీలు వస్తే దుకాణాలు మూసేయిస్తున్నారు. శాశ్వత చిరునామా లేక పరేషానవుతున్నారు. నగరంలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా శాశ్వత పరిష్కారం చూపాలని పలుమార్లు వీధి వ్యాపారుల ప్రతినిధులు విన్నవించినా అధికారుల్లో చలనం లేదు.

ఐదు వేల మంది ఉన్నా.. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో సుమారు ఐదు వేల మంది చిరు వ్యాపారులుంటారు. వీరికి శాశ్వత చిరునామా చూపించేందుకు గ్రేటర్ వరంగల్ దృష్టి సారించింది. టౌన్‌ప్లానింగ్ విభాగం క్షేత్రస్థాయిలో సర్వే చేసింది. 61 ప్రాంతాలు గుర్తించారు. 31 ప్రాంతాల్లో గ్రీన్ జోన్(వీధి విక్రయ కేంద్రాలు), 14 అంబర్ జోన్లు(సమయానికి అనుగుణంగా వ్యాపారాలు), 14 రెడ్ జోన్లు(వీధి వ్యాపారాల నిషేధం) ఎంపిక చేశారు. 17 ప్రాంతాల్లో చిరు వ్యాపారుల కోసం హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యం ఉండగా 11 పూర్తి చేశారు. కేవలం 517 మందికి దుకాణాలు కేటాయించారు. కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లో 11 వీధి విక్రయ కేంద్రాలు ప్రారంభించారు. 517 మంది చిరు వ్యాపారులకు షెడ్లు కేటాయించారు. కాజీపేట బాపూజీనగర్‌లో కూరగాయలు, పండ్లు విక్రయ కేంద్రాల్లో వ్యాపారులున్నారు. లి హనుమకొండ కుమార్‌పల్లి కూరగాయల మార్కెటు, మాంసం మార్కెట్లో వినియోగంలో ఉన్నాయి. సుబేదారి పోలీసు స్టేషన్ పక్కనే వినియోగంలో ఉంది. టీటీడీ కల్యాణ మండపం నుంచి జిల్లా గ్రంథాలయం వరకు, ఎల్బీ ప్రాక్టీసింగ్ హైస్కూల్ నుంచి డైట్ కళాశాల వరకు, ఎస్ఈ ఇరిగేషన్ కార్యాలయం నుంచి ఐబీ ప్రహరీ వరకు, బీఈడీ కళాశాల, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వెనకాల షెడ్లు చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయి. హనుమకొండ చౌరస్తా, విజయటాకీస్ రోడ్, టైలర్‌స్ట్రీటు, ఏనుగులగడ్డ, కొత్త బస్టాండ్, అలంకార్, అదాలత్, నయీంనగర్, కేయూసీ జంక్షన్, ఎన్జీవోస్ కాలనీ, బాలసముద్రం ఏకశిలా పార్కు తదితర ప్రాంతాల్లో రహదారుల్లోనే చిరు వ్యాపారాలు నడుస్తున్నాయి. వరంగల్ ప్రాంతంలో సుమారు 2–3 వేల మంది చిరు వ్యాపారులుంటారు. ఇంతవరకు ఒక్క వీధి విక్రయ కేంద్రం ఏర్పాటు కాలేదు. ఐదారేళ్ల క్రితం వరంగల్ అండర్ బ్రిడ్జి పక్కనే రైల్వే ట్రాక్ పక్కన షెడ్లు కడుతుంటే అభ్యంతరాలు వచ్చాయి. వరంగల్ స్టేషన్ పార్కు, పోచమ్మ మైదాన్, ఎంజీఎం ఆసుపత్రి, రాంకీ వద్ద స్థలాలు ఎంపిక చేశారు. ఇంతవరకు అడుగులు పడలేదు. లి గోపాలస్వామి గుడి, పోచమ్మ మైదాన్, కాశీబుగ్గ, వరంగల్ రైల్వే, బస్ స్టేషన్లు, వరంగల్ ప్రధాన తంతి తపాలా కేంద్రం, అండర్‌బ్రిడ్జి, వరంగల్ చౌరస్తా, జేపీఎన్ రోడ్, పాత చౌరస్తా, బట్టల బజారు, పాపయ్యపేట చమన్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పైనే చిరు వ్యాపారాలు సాగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

స్థలాల కోసం సర్వే: రమేష్, టీఎంసీ, మెప్మా

కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో వీధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలాల ఎంపిక సర్వే నడుస్తోంది. ఇప్పటి వరకు 11 ప్రాంతాల్లో పూర్తయ్యాయి. 517 మందికి దుకాణాలు కేటాయించాం. వరంగల్‌లో స్థలాలు లభిస్తే వెంటనే పనులు మొదలవుతాయి.

రూ.లక్షలు వెచ్చించారు.. వృథాగా వదిలేశారు నర్సంపేట : వీధి వ్యాపారుల కోసం నర్సంపేట పురపాలిక అధికారులు లక్షల రూపాయలు వెచ్చించి 2021 ఫిబ్రవరిలో అంగడి మైదానంలో వ్యాపార మడిగలు నిర్మించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మెప్మా సిబ్బంది గుర్తించిన వీధి వ్యాపారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కూరగాయలు, పండ్లు, పూలు, కుండలు, ప్లంబర్, జనరల్ సామాను, చిల్లర కొట్టు, ప్లాస్టిక్ సామాను వంటి వివిధ వ్యాపారాలు చేసే వీరు దుకాణాలు నిర్వహణకు సొంత అడ్డాల్లేక నానా కష్టాలు పడుతున్నారు.వీరికి చేయూతనిచ్చేందుకు నర్సంపేటలో పట్టణ ప్రగతి పథకంలో రూ.7 లక్షలతో 15 షెడ్లు నిర్మించారు. పుర అధికారులు కూరగాయల మార్కెట్(రైతు బజారు)స్థలంలో పక్కాగా నిర్మించారు. 2021 ఫ్రిబవరిలో షెడ్లను ప్రారంభిస్తామని చెప్పిన అధికారులు అప్పట్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయారు. ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోక దిష్టిబొమ్మల్లా వెక్కిరిస్తున్నాయి. ఈ షెడ్లలోకి వచ్చేందుకు వీధి వ్యాపారులు సుముఖత చూపడం లేదు. ఇక్కడ దుకాణాలు పెడితే బేరాలు సాగవని చెప్పి ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కట్టించిన షెడ్లు వీధి వ్యాపారులకు ఉపయోగపడక పోగా ..నిర్మాణంతో పుర ఖజానాకు చిల్లి పడింది.నత్తనడకన సాగుతున్న భవన నిర్మాణం వర్ధన్నపేట : వర్ధన్నపేటలో చిరు వ్యాపారులకు ఉపయోగపడేలా నిర్మించ దలిచిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన సముదాయ పనులు రెండు సంవత్సరాలుగా పునాదులకే పరిమితమయ్యాయి. పనులునత్తనడకన సాగుతుండడంపై ఎమ్మెల్యే అరూరి రమేశ్ స్వయంగా గుత్తేదారునిపై, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా వేగంగా జరగడం లేదు. సుమారు వంద మంది వరకు చిరు వ్యాపారులు ఉండగా జాతీయ రహదారి పక్కన అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

# వినియోగం లేనట్లేనా?

భూపాలపల్లి : ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో వీధి వ్యాపారులకు ప్రత్యేకంగా షెడ్లు నిర్మించినా వినియోగించుకోవడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఎండలకు, వానలకు తట్టుకొనేలా పట్టణ ప్రగతి నిధులు రూ.14.59 లక్షలతో సుభాష్‌కాలనీ సమీపంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన 28 రేకుల షెడ్లు నిర్మించారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈ ఏడాది ఫిబ్రవరి 23న ప్రారంభించారు. ఒక రోజు ముందుగానే వీధి వ్యాపారులకు డ్రా పద్ధతిన కేటాయించారు. మంత్రి ప్రారంభించిన కొద్దిసేపు మాత్రమే వీధి వ్యాపారులు ఆ షెడ్లలో అమ్మకాలు సాగించారు. మళ్లీ పాత ప్రాంతాల్లో రోడ్ల పక్కనే అమ్మకాలు చేపడుతున్నారు.

రద్దీ ప్రాంతాల్లోనే నిర్మించాలి..

వీధి వ్యాపారుల కోసం ప్రభుత్వం నిర్మించే రేకుల షెడ్లను రద్దీ ప్రాంతాల్లోనే నిర్మించాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం నిర్మించిన షెడ్లు అంబేద్కర్ కూడలి ప్రాంతం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల



పక్కన సుమారు 600 మీటర్ల దూరంలో ఉండటంతో అందులో అమ్మకాలు కొనసాగవని ముందుకు రావడం లేదు. అంబేద్కర్ కూడలి ప్రాంతంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయం ముందు భాగంలో, గణేష్ చౌక్ ప్రాంతంలో అటవీ శాఖ కాంప్లెక్స్ ముందు, సింగరేణి ఏరియా వర్క్ షాపు ముందు భాగంలో రేకుల షెడ్లు నిర్మిస్తే వీధి వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని పలువురు వ్యాపారులు తెలిపారు.

తప్పని ట్రాఫిక్ సమస్య

జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి, గణేష్ చౌక్, సింగరేణి వర్క్ షాపు ఏరియా ప్రాంతాల్లో రోడ్ల పక్కన తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు, పూల అమ్మకాలు కొనసాగుతున్నాయి. రోడ్ల పైనే అమ్మకాలు చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పలు సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అంబేద్కర్ కూడలి ప్రాంతంలో కొద్ది నెలల క్రితం లారీ ఢీకొని కార్మికుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు, పాలకులు ట్రాఫిక్ సమస్యను సరిదిద్దడానికి తాత్కాలికంగా నిర్ణయాలు తీసుకుని, ఆ తర్వాత వదిలేస్తున్నారు.

రద్దీ ప్రాంతాల్లోనే నిర్మించాలి– లలిత, చిరు వ్యాపారి

ప్రభుత్వం నిర్మించిన రేకుల షెడ్లు దూరంగా ఉండటంతో అందులో అమ్మకాలు కొనసాగవనే నమ్మకంతో చిరు వ్యాపారులు అందులోకి వెళ్లడం లేదు. అమ్మకాలు జరిగే ప్రాంతంలోనే షెడ్లు నిర్మించాలి. వారు ఎక్కడ ఖాళీ స్థలం అనుకూలంగా ఉంటే అక్కడ నిర్మించారు. అందులోకి వెళ్తే అమ్మకాలు ఉండవు. షెడ్లలో మాంసం, చికెన్ సెంటర్లకు కేటాయిస్తే బాగుంటుంది.

చిరు వ్యాపారులకు నష్టం చేయవద్దు– అంబాల చంద్రమౌళి, కాకతీయ ఫ్రూట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జనాల రద్దీ, ప్రయాణికులు ఎక్కువగా బస్సుల కోసం వేచి చూసే ప్రదేశాల్లోనే పండ్లు, పూలు తదితర చిరు వ్యాపారాలు ఎక్కువగా కొనసాగుతాయి. పట్టణంలో మున్సిపాలిటీ అధికారులు నిర్మించిన 28 రేకుల షెడ్లు జనాలు ఎక్కువగా సంచరించని ప్రాంతంలో ఉండటంతో అందులోకి వెళ్లడానికి చిరు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాంతాల్లోనే అమ్మకాలు చేపట్టేందుకు వారికి అనుమతులివ్వాలి.త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం– రాజేశ్వరి, మెప్మా పీడీ15 రోజుల క్రితం డ్రా పద్ధతిన రేకుల షెడ్లు కేటాయించిన చిరు వ్యాపారులతో త్వరలోనే మున్సిపల్ కమిషనర్, ఛైర్ పర్సన్ సమక్షంలో సమావేశాన్ని నిర్వహిస్తాం. వారికి మరి కొద్ది రోజుల సమయాన్ని కేటాయించి, డిమాండ్లను పరిగణలోకి తీసుకుని, జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు వారికి కేటాయించిన షెడ్లలోకి పంపించడానికి చర్యలు తీసుకుంటాం.

# నిర్మించి.. నిరుపయోగంగా వదిలేసి!

కరీంనగర్ : అంబేద్కర్ స్టేడియం ఎదురుగా రోడ్డుపై కూరగాయలు అమ్ముతున్న వారికి బస్టాండ్ వెనుకాల ఉన్న షెడ్డులో కేటాయించారు. కొన్ని రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో ఇక్కడే విక్రయించారు. కొనుగోలుదారులు రాకపోవడంతో చిరు వ్యాపారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.రెండేళ్ల కిందట కరోనా రావడం.. లాక్‌డౌన్ విధించడం.. వ్యక్తిగత దూరం పాటించేందుకు వీలుగా డివిజన్ల వారీగా ఎక్కడ పడితే అక్కడ కూరగాయలు అమ్ముకోవడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. అక్కడే విక్రయించేలా పర్యవేక్షణ చేశారు. సాధారణ పరిస్థితి వచ్చాక కొన్ని చోట్ల నుంచి దుకాణాలు తొలగించగా.. రహదారులపై మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. వీటిని తొలగించి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన షెడ్లలోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నా.. మున్నాళ్ల ముచ్చటగా తయారైంది. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి.

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా శివారు కాలనీలు విస్తరిస్తున్నాయి. నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనేందుకు ఒకటెండ్రు ప్రాంతాలకే రాకుండా రద్దీని తగ్గించేందుకు, ఎక్కడి వారిని అక్కడే కొనేందుకు, చిరు వ్యాపారులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు వీలుగా పలు ప్రాంతాల్లో చిన్న మార్కెట్లు నిర్మించారు. ఖాళీ స్థలాలు, రద్దీ సమయాల్లో రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రోడ్లపైనే అడ్డాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరందరికి ఒక్కో చోట రూ.17 లక్షలకు తగ్గకుండా ఖర్చు చేసి నిర్మించగా అవన్నీ ఖాళీగా ఉన్నాయి.

మార్కెట్లకు రాని వ్యాపారులు.. హౌసింగ్‌బోర్డు కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించగా సుమారు 60 మందికి తగ్గకుండా కూర్చొనేందుకు గద్దెలు నిర్మించారు. ఇక్కడికీ పాతబజారు ప్రాంతంలోని వారికి అవకాశం కల్పించాల్సి ఉంటుంది. బస్టాండ్ వెనుకాల వెండింగ్ జోన్‌ను రూ.17 లక్షలు ఖర్చు చేసి నిర్మించారు. పండ్ల వ్యాపారులకు కేటాయించగా ప్రస్తుతం కమ్మరి వృత్తి చేసే వారికి కేటాయించగా మిగతా భాగం ఖాళీగా ఉంది. కొన్ని రోజులు అంబేద్కర్ స్టేడియం ఎదురుగా కూర్చొనే వారికి కేటాయించారు. ఇందిరానగర్ మార్కెట్‌ను రూ.30 లక్షలతో నిర్మించగా 60 మంది వ్యాపారులకు సౌకర్యాలు కల్పించారు. అందులో ఉదయం పూట పది మంది వ్యాపారులు మాత్రమే వచ్చి విక్రయిస్తున్నారు. చైతన్యపురి మార్కెట్‌లో సుమారు 45 మంది అమ్ముకునేలా నిర్మించారు. ఎస్ఆర్ఆర్ కళాశాల వైపు విక్రయించే వారికి కేటాయించగా అందులో సగం మంది వస్తున్నారు. మిగతా వారంతా రోడ్ల మీద అమ్మడానికి ఆసక్తి చూపుతున్నారు.


ప్రారంభోత్సవానికి సిద్ధం

సప్తగిరికాలనీలో రూ.40 లక్షలతో నిర్మించగా సుమారు 60 మంది కూర్చునే విధంగా తీర్చిదిద్దారు. ఇందుల్లోకి టెలిఫోన్ క్వార్టర్స్ వైపు రోడ్ల మీద ఉన్న వారికి కేటాయించాలని నిర్ణయించారు. కశ్మీర్‌గడ్డ రైతుబజారును సమీకృత మార్కెట్ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. టెండర్ పూర్తి కాగా రూ.30 లక్షలతో తాత్కాలికంగా షెడ్డు నిర్మించారు. మొత్తం 122 మందికి అవకాశం కల్పించనున్నారు. విద్యానగర్‌లోని ట్యాంకు సమీపంలో వెండింగ్ జోన్ పూర్తయింది. ఇందులో ఆ ప్రాంతంలో రోడ్ల మీదనే ఉండే వారికి అవకాశం ఇస్తారు. ఆయా ప్రాంతాల్లో నిర్మించిన షెడ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

# వర్షాలు, వరదలపై సీఎం జగన్ ఉన్నతస్థాయి సమీక్ష



తాడేపల్లి: రాష్ట్రంలోని వర్షాలు, వరదలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎంవో అధికారులతో సమావేశం చేపట్టారు. గోదావరిలో వరద పెరుగుతుండడంతో అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నదీతార ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ ముంపు బాధితులకు బాసటగా నిలవాలని తెలిపారు. ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల పరిస్థితులతోపాటు, భారీవర్షాలు కురుస్తున్న ఇతర ప్రాంతాల గురించి కూడా ముఖ్యమంత్రి ఆరాతీశారు. 42 మండలాల్లోని 458 గ్రామాలను అప్రమత్తం చేశామని సీఎం??కు అధికారులు వివరించారు. సహాయచర్యల్లో 3 %చీణ=ఖీ, 4 ాణ=ఖీ% బృందాలు ఉన్నాయని తెలిపారు. గోదావరి నదికి ఆనుకుని ఉన్న జిల్లాల్లో ఇప్పటికే కంట్రోల్ రూమ్స్ పనిచేస్తున్నాయని, ముంపునకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో బోట్లు సహా సహాయక సిబ్బందిని సిద్ధంచేశామని అధికారులు తెలియ జేశారు. ఏలూరు జిల్లా కుకునూరు, వేలేరుపాడు సహా ఇతర మండలాల్లో ఇప్పటికే సహాయక శిబిరాలను తెరిచామని చెప్పారు. ముంపు ప్రాంత ప్రజలను సహాయక శిబిరాలకు తరలించామని, మందులు సహా ఇతరత్రా అత్యవసర వస్తువులను సిద్ధంగా ఉంచామని అధికారులు సీఎంకు వివరించారు. కోనసీమ జిల్లాలో 150 బోట్లను రెడీ ఉంచామన్న అధికారులు.. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలోని మూడు మండలాల్లో ముంపునకు ఆస్కారం ఉన్న గ్రామాల్లో అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.




మంగళగిరి: పోలవరం పూర్తయితే తెలుగు తల్లి ఆనందపడేదని తెదేపా అధినేత చంద్రబాబు అన్నారు. స్వర్ణచతుర్భుజి స్ఫూర్తితో నదుల అనుసంధానం చేయాలని గతంలో వాజ్‌పేయికి సూచించానని చెప్పారు. 'పోలవరానికి జగనే శని' అంశంపై చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ప్రమాణ స్వీకారం రోజే పోలవరం పనులను నిలిపేసిన ఘనత జగన్‌దని విమర్శించారు. "పోలవరానికి జగనే శని. శని పోతే తప్ప ప్రాజెక్టు కల సాకారం కాదు. అహంకారంతో పోలవరంను నాశనం చేశారు. ఇది పూర్తయితే ఏపీలోని అన్ని ప్రాజెక్టులకు నీళ్లివ్వొచ్చు. 15 నెలలపాటు పోలవరం వద్ద నిర్మాణ సంస్థే లేకుండా చేశారు. కాంట్రాక్టర్‌ను మార్చొద్దని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) చెప్పినా జగన్ వినలేదు. మా హయాంలో పోలవరానికి రూ.11,537 కోట్లు ఖర్చుపెట్టాం. జగన్ కేవలం రూ.4,611 కోట్లతో సరిపెట్టారు. నాడు పోలవరం పర్యాటక ప్రాంతంగా ఉండేది. నేడు నిషేధిత ప్రాంతంగా చేశారు.

**ఎందుకెళ్లకూడదు.. అదేమన్నా పాకిస్థానా? :** డయాఫ్రం వాల్ దెబ్బతింటే మమ్మల్ని విమర్శిస్తారా? వరదల వల్లే దెబ్బతిందని నిపుణుల కమిటీనే తేల్చింది. ప్రాజెక్టును చూడటానికి ఎందుకెళ్లకూడదు? అదేమైనా పాకిస్థానా? గైడ్ బండ్ కూడా కుంగడంతో పోలవరంలో ఇంకేం మిగిలింది? ఇన్ని తప్పిదాలు జరిగితే.. ఆంబోతు రంకెలేస్తారా? నిర్వాసితులకు ఎకరాకు రూ.19లక్షలు ఇస్తామన్న హామీ మరిచారు. పరిహారం ఇవ్వకపోగా లబ్ధిదారుల జాబితా మార్చి మోసం చేశారు. పేదల పొట్ట కొట్టి జగన్ తన పొట్ట పెంచుకుంటున్నారు.

పేదలను దోచుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు" అని చంద్రబాబు విమర్శించారు.

# సీఎం మమ్మల్ని మోసం చేసారు.. లోకేష్‌తో గ్రానైట్ రంగం ప్రతినిధులు

ప్రకాశం జిల్లా: టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా శుక్రవారం ప్రకాశం జిల్లా, ఒంగోలులో గ్రానైట్ రంగం ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.

**గ్రానైట్ ప్రతినిధులు మాట్లాడుతూ..** టీడీపీ హయాంలో రూ. 4 ఉన్న యూనిట్ విద్యుత్ ధర.. జగన్ పాలనలో రూ.7కు పెరిగిపోయిందని, కరెంట్ ఛార్జీలు తగ్గిస్తామని చెప్పి మమ్మల్ని మోసం చేసారన్నారు. 4 లక్షల మందికి ఉపాధిగా ఉన్న చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమను జగన్ నాశనం చేశారన్నారు. జగన్ పాలనలో 800 ఫ్యాక్టరీల్లో సగం మూతపడ్డాయని, గ్రానైట్ ఎక్స్ పోర్ట్ చెయ్యడానికి ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కృష్ణపట్నం పోర్టు అదానీకి ఇచ్చి ఇతర కంపెనీల కంటైనర్లు రాకుండా చెయ్యడం వలన ఎక్స్ పోర్ట్‌పై ఒక్కో కంపెనీకి రూ.60 వేలు అదనంగా ఖర్చు అవుతుందని వారు వాపోయారు. రాయల్టీ తగ్గిస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్... ఇప్పుడు వంద శాతం పెంచి మా పొట్ట కొట్టారన్నారు. మైనింగ్ యాజమానులపై విపరీతమైన ఫైన్లు వేసి వేధిస్తున్నారని, గ్రానైట్ ట్రాన్స్ పోర్ట్ రంగాన్ని ముఖ్యమంత్రి దెబ్బతీశారన్నారు.

మరోవైపు ఓవర్ లోడ్ పేరుతో పోలీసులు వేధిస్తున్నారని, ఫైన్లు విపరీతంగా పెంచేశారని, రూ.2 వేలు ఉన్న ఓనర్ పెనాల్టీని జగన్ రూ.20 వేలు చేశారన్నారు. టన్నుపై వెయ్యి ఉన్న పెనాల్టీ జగన్ రెండు వేలు చేసారని, 400 లారీలు గతంలో తిరిగేవని, ఇప్పుడు కేవలం 40 లారీలు తిరిగే పరిస్థితి వచ్చిందని గ్రానైట్ రంగం ప్రతినిధులు లోకేష్‌కు తమ సమస్యలు చెప్పుకున్నారు.




**వారి సమస్యలపై స్పందించిన లోకేష్ మాట్లాడుతూ...** దోపిడీదార్లు, పేదలకి మధ్య యుద్ధం జరుగుతోందని, దోపిడీదారు జగన్ పాలనలో అన్ని రంగాల ప్రజలు బాధితులేనని అన్నారు. మైనింగ్ రంగంపై ఆధారపడిన వారు కూడా జగన్ బాధితులేనన్నారు. జగన్ పాలనలో జనం భయంతో బ్రతుకుతున్నారని, గ్రానైట్ పరిశ్రమపై రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది ఆధారపడి ఉన్నారని, అలాంటి రంగాన్ని జగన్ దెబ్బకొట్టారన్నారు. జగన్ మైనింగ్ కంపెనీ కోసం రాష్ట్రంలో ఉన్న ఇతర అన్ని మైనింగ్ యజమానులను వేధిస్తున్నారని, గ్రానైట్‌ని ఇండస్ట్రీగా గుర్తించి రాయితీలు, ప్రోత్సాహకాలు ఇచ్చింది టీడీపీయేనన్నారు. టీడీపీ హయాంలో ఎప్పుడూ గ్రానైట్ పరిశ్రమను వేధించలేదన్నారు. జగన్ గ్రానైట్ పరిశ్రమను మోసం చేసి సంక్షోభంలోకి నెట్టేసారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ మైనింగ్ కంపెనీ తప్ప వేరే కంపెనీ ఉండకూడదనే ఉద్దేశంతో అందరినీ వేధిస్తున్నారని లోకేష్ అన్నారు. జీవో 42 తెచ్చి రాయల్టీని వంద శాతం పెంచారని, జీవో 65 తెచ్చి డెడ్ రెంట్‌ని 10 రెట్లు పెంచేసారన్నారు.

సెక్యూరిటీ డిపాజిట్ 3 రెట్లు పెంచారని ఆరోపించారు. జీవో 90 తీసుకొచ్చి మైనింగ్ కంపల్సరీ పేరుతో ముందే పన్నులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. జగన్ చీమకుర్తి వచ్చినప్పుడు అనేక హామీలు ఇచ్చారని, రాయల్టీ, కరెంట్ ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన గ్రానైట్ పాలసీ తీసుకొస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అమలు అవుతున్న మంచి పాలసీలు అధ్యయనం చేసి మెరుగైన పాలసీ అమలు చేస్తామని, అలాగే కరెంట్ ఛార్జీలు తగ్గించి గతంలో ఇచ్చిన రేటుకే విద్యుత్ అందిస్తామన్నారు. పెట్రోల్, డీజిల్‌పై పన్నులు తగ్గించి ధరలు తగ్గిస్తామని లోకేష్ స్పష్టం చేశారు.




నందిగామ: భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణా జిల్లా నందిగామ వద్ద మున్నేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నందిగామ పట్టణంతో పాటు కంచల, పెండ్యాల గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయ య్యాయి. నందిగామలోని పాత బస్టాండ్ వెనుక ప్రాంతం, కుమ్మరి బజార్, రైతుపేట డౌన్, కుమార్ స్వామి నగర్‌లోకి వరద పోటెత్తింది. ఇళ్లలో వరద రావడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

నందిగామ మున్నేరు వంతెన పైనుంచి వరదను వీక్షించేందుకు సందర్శకులు భారీగా తరలివస్తున్నారు. కుటుంబ సభ్యులతో సహా బ్రిడ్జి పైనుంచి వరదలు చూస్తూ ఫొటోలు దిగుతున్నారు. కొంతమంది సెల్ఫీలు తీసుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మున్నేరు వంతెన రద్దీ నెలకొంది.

**రద్దీగా నందిగామ-మధిర రోడ్డు :** విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఐతవరం వద్ద మున్నేరు వరద ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. నందిగామ నుంచి మధిర మీదుగా విజయవాడ వైపు వాహనాలను మళ్లించారు. దీంతో నందిగామ నుంచి మధిర వెళ్లే రోడ్డు వాహనాలు రాకపోకలతో కొద్దిగా మారింది. భారీగా కార్లు, లారీలు, ద్విచక్ర వాహనాలు ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పలుచోట్ల ట్రాఫిక్‌కి అంతరాయం కలుగుతోంది.

# రాయలసీమలో చంద్రబాబు పర్యటన ఖరారు...



అనంతపురం: రాయలసీమలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటన ఖరారైందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ నుంచి రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల సందర్శన ఉంటుందని, 3న గండికోట రిజర్వాయర్ పరిశీలన తర్వాత అనంతపురం జిల్లాకు చంద్రబాబు వస్తారని తెలిపారు. 4న కళ్యాణదుర్గంలో బైరవానితిప్ప ప్రాజెక్టు, పేరూర్‌లో ఇతర ప్రాజెక్టులు పరిశీలిస్తారని తెలిపారు. రాయలసీమ భవిష్యత్‌తో సీఎం జగన్ ఆటలాడుకుంటున్నారని విమర్శించారు. కరువు జిల్లాలకు నీరు అందించే ప్రాజెక్టులను సీఎం జగన్ ఆపేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి అసమర్థత వల్ల రాయలసీమలో వేరుశనగ పంట దిగుబడి తగ్గిందని, రాష్ట్ర వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులపై పరిశీలన జరుగుతుందని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. రాయలసీమ జీవనాడి లాంటి హంద్రీనీవా వెడల్పును ఈ ప్రభుత్వం ఆపేసిందని, పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మిస్తానని చెప్పి టెండర్లు కూడా పిలవలేదని మండిపడ్డారు.

జరిగే పనులు ఆపివేసి అనంతపురం జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. జిల్లా మనవడునని చెప్పి ముఖ్యమంత్రి ప్రాజెక్టులు ఆపివేసి నయవంచనకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డి వైఫల్యాలను ఎండగట్టేందుకే చంద్రబాబు పర్యటన చేయనున్నారని తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పిలుపిచ్చారు. సాంకేతిక కారణాలు చూపించి రైతుల నోట్లో ఈ ప్రభుత్వం మట్టికొడుతుందని, జగన్ మోహన్ రెడ్డి దుర్మార్గాలు, అవినీతిని ఎండగడతామని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

# 'అమ్మఒడి'కి విద్యార్థులను తరలించడంపై దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్‌ను అనుమతించిన హైకోర్టు




అమరావతి : అమ్మఒడి కార్యక్రమానికి స్కూల్ పిల్లలను తరలించడంపై దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్‌ను ఏపీ హైకోర్టు అనుమతించింది. విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ , హెూం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీలకు హైకోర్ట్ నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయూర్తి జస్టిస్ డీఎస్ ఠాకూర్ ధర్మాసనం ముందు న్యాయవాది జడ శ్రావణ కుమార్ వాదనలు వినిపించారు. ముఖ్యమంత్రి జగన్ పాల్గొన్న సభకు పిల్లలను తరలించడం చట్టవిరుద్ధమని ధర్మాసనానికి తెలిపారు. గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధమని శ్రావణ కుమార్ పేర్కొన్నారు.

పిల్లలను తరలించిన అంశాన్ని విద్యాశాఖ అధికారి సమాచార హక్కు చట్టం కింద సమాచారం ఇచ్చిన అంశాన్ని న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అధికారులే సమాచారం ఇచ్చారు కదా అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మొదటి కేసుగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్ ధర్మాసనం విచారించింది. విద్యార్థులను రాజకీయ, ప్రభుత్వ కార్యక్రమాలకు తరలించి వద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన తీర్పును న్యాయవాది శ్రావణ కుమార్ కోర్టుకి గుర్తు చేశారు. వెంటనే విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ , హెూం శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీలకు నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది.

# మా పార్టీకి కష్టాలు తప్పేలా లేవు..

న్యూఢిల్లీ: కొన్ని సర్వే ఏజెన్సీల ద్వారా వచ్చిన రిపోర్టులను చూస్తుంటే... వైసీపీ పార్టీకి కష్టాలు తప్పేలా లేవని, లోక్ సభ ఎన్నికల్లో వైసీపీ వాళ్లకు 4, 5 స్థానాలు కూడా వచ్చే అవకాశం లేదని ఆ పార్టీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణంరాజు అన్నారు. ఏపీ ఓటర్ మదిలో ఏముంది? అన్న మీడియా ప్రశ్నకు సమాధానంగా శుక్రవారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ.. 2009లో కాంగ్రెస్ విజయం సాధించిందని, అనంతరం ఏపీలో కాంగ్రెస్ పార్టీ కాస్తా వైఎస్సార్సీపీగా మారిందన్నారు. గతంలో కాంగ్రెస్ సంప్రదాయ ఓట్లు వైఎస్సార్సీపీకి వేశారని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు 6 శాతం మేర ఓట్లు వైఎస్సార్సీపీకి నష్టం చేయనున్నాయని, ముస్లిం, మైనార్టీ ఓట్లు రాజశేఖర్ రెడ్డిని చూసి ప్రజలు వైఎస్సార్సీపీకి ఓట్లు వేశారని రఘురామ అన్నారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ముస్లిం సోదరులు కాంగ్రెస్‌కు వేసే పరిస్థితి వచ్చిందన్నారు. గెలుపుతో సంబంధం లేకపోయినా కాంగ్రెస్‌కు సంప్రదాయంగా వేసే అవకాశం ఉందన్నారు.

రాబోయే రోజుల్లో కడప, రాజంపేటపై ప్రభావం పడే అవకాశం ఉందని, వైఎస్సార్సీపీకి సాలిడ్ ఓటు బ్యాంకు అయిన ఎస్సీ, ఎస్టీలో కొంత శాతం మార్పు కనిపిస్తోందన్నారు. అందరూ




అనుకుంటున్నట్లు షర్మిల ఏపీలో కాంగ్రెస్ పార్టీకి వస్తే ఇంకా ప్రభావం ఉండే అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి 40 సీట్లు మాత్రమే వచ్చే విధంగా కనిపిస్తోందని, సజ్జల సయితం ఎన్నికలపై మాట్లాడడం లేదన్నారు. పొత్తులపై అధికారికంగా ప్రకటన రావడానికి కొంత సమయం పడుతుందని, ప్రతిపక్షాల ఓట్లు చీలవని రఘురామ అభిప్రాయం వ్యక్తం చేశారు.




మలప్పురం: అదృష్టం ఎప్పుడు ఎవరి తలుపు తడుతుందో చెప్పలేం. లక్ కలిసొస్తే రాత్రికి రాత్రే కోటీశ్వరులవుతారు..! అది ఈ మహిళల విషయంలో నిజమైంది. కనీసం ఒక్కొక్కరి చేతిలో రూ.25 లేని 11 మంది మహిళలు తమ దగ్గరున్న చిల్లరంతా జమచేసి రూ.250తో లాటరీ టికెట్ కొన్నారు. అదృష్టం కలిసిరావడంతో వీరి టికెట్‌కే లాటరీ తగిలి ఏకంగా రూ.10 కోట్ల జాక్‌పాట్ కొట్టేశారు. కేరళలోని మలప్పురం జిల్లాలో గల పరప్పణగాడి మున్సిపాలిటీలో హరిత కర్మ సేన అనే విభాగం ఉంది. ఈ బృందంలోని సభ్యులు భూమిలో కలిసిపోని వ్యర్థాలను ఇళ్లు, ఆఫీసుల నుంచి సేకరించి రీసైక్లింగ్ కోసం యూనిట్లకు పంపిస్తారు. ఇందులో పనిచేస్తున్న 11 మంది మహిళలు కొద్ది వారాల క్రితం లాటరీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నారు. కానీ, ఆ లాటరీ టికెట్ ధర రూ.250గా ఉంది. ఆ మహిళలెవరి వద్దా అంతమొత్తం డబ్బు లేదు. దీంతో తమ దగ్గరున్న చిల్లరంతా పోగు చేశారు. ఓ మహిళ అయితే ఆ చిల్లర కూడా లేక తెలిసినవారి నుంచి చేబదులు తీసుకుని ఇచ్చింది. అలా ఆ 11 మంది రూ.250 జమచేసి లాటరీ టికెట్ కొన్నారు. కేరళ లాటరీ డిపార్ట్‌మెంట్ గత బుధవారం డ్రా తీయగా.. ఈ మహిళలు కొన్న టికెట్‌కే జాక్‌పాట్ తగిలింది. ఈ లాటరీ ప్రైజ్ మనీ రూ.10కోట్లు కావడంతో ఆ మహిళల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. "మేం అంతకుముందు కూడా చాలా సార్లు లాటరీ టికెట్ కొన్నాం. కానీ ఈసారి మేమంతా డబ్బులు జమచేసుకున్న టికెట్‌కు లాటరీ తగిలింది. మాకు జాక్‌పాట్ తగలడం సంతోషంగా ఉంది. మేమంతా కుటుంబం కోసం ఎంతో కష్టపడుతున్నాం. మాకొచ్చే జీతం డబ్బుతోనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. ఆడపిల్లల పెళ్లిళ్లు, అప్పులు, చికిత్సలు ఇలా ఆర్థికంగా ఎన్నో సమస్యలున్నాయి. ఈ డబ్బుతో మా సమస్యలు తీరుతాయి" అని ఆ మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

# ఇద్దరు ఉన్నతాధికారులకు హైకోర్టు నోటీసులు.. స్పందించిన మంత్రి బొత్స

అమరావతి: కోర్టు ధిక్కరణ కేసులో ఇద్దరు ఉన్నతాధికారులకు ఏపీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇటీవల విజయనగరం జిల్లా కురుపాంలో జరిగిన అమ్మఒడి సభకు విద్యార్థులను తరలించడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విద్యార్థుల విషయంలో అధికారులు నిబంధనలు ఉల్లంఘించారని పిటిషనర్ తరపు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థులను రాజకీయ సభలకు తరలించడం చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించింది.

ఈ మేరకు ఏపీ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్, హెూంశాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను హైకోర్టు 4 వారాలకు వాయిదా వేసింది. అయితే ఇద్దరు ఉన్నతాధికారులకు హైకోర్టు నోటీసులు ఇవ్వడంపై ఏపీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. అమ్మ ఒడి సభకు



విద్యార్థులు, తల్లిదండ్రులు రావడం తప్పు కాదన్నారు. లేదంటే ఇలాంటి కార్యక్రమాలకు సినీ నటులు వస్తారా? అని ప్రశ్నించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల రాకపై కోర్టు సూచనలిస్తే పాటిస్తామని తెలిపారు.

## పూజా విషయంలో సీన్ రివర్స్ జరుగుతుంది..!

బుట్ట బొమ్మ పూజా హెగ్డేకి తెలుగు సినిమా అవకాశాలు రావట్లేదు. అమ్మడి టాలీవుడ్ కెరీర్ ముగిసినట్టే కమిటైన సినిమాల నుంచి కూడా ఆమెను తీసేస్తున్నారు అంటూ మీడియా లో ప్రచారం తెలిసిందే. పూజా హెగ్డే కి ఆఫర్లు రావడం లేదు దాదాపు అమ్మడు పని అయిపోయినట్టే అని చెప్పుకుంటున్నారు. కానీ ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే పూజానే కావాల ని తెలుగు ఆఫర్స్ ను రిజెక్ట్ చేస్తుందని టాక్. అదేంటి తనకు స్టార్డమ్ తెచ్చిన టాలీవుడ్ ఛాన్స్ లు పూజా ఎందుకు వదిలేస్తుంది అంటే.. పూజాకి ఆ సినిమాలు నచ్చకనే అని తెలుస్తుంది. పూజా హెగ్డే గుంటూరు కారం నుంచి కూడా బయట కు వెళ్లింది. దానికి కారణం మాత్రం సినిమా షూటింగ్ లేట్ అవడమే అని చెబుతున్నారు. లాస్ట్ ఇయర్ ఎప్పుడో మొదలైన ఈ సినిమా కు పూజా ఇచ్చిన డేట్స్ అన్ని మిస్ యూజ్ అయ్యాయి. ఆ టైం లో షూటింగ్ జరుగుతుందని పూజా బేబీ వేరే సినిమా కు కొన్ని డేట్స్



ఇచ్చింది. అయితే గుంటూరు కారం సినిమా షూటింగ్ వాయిదా పడటంతో డేట్స్ క్లాష్ వల్ల పూజా ఆ సినిమా వదులుకోక తప్పలేదు. ప్రస్తుతం గుంటూరు కారం చేయాల్సిన పూజా హిందీ సినిమా కు డేట్స్ ఇవ్వడం జరిగిందట. అందుకే పూజా సైలెంట్ గా ఎగ్జిట్ అయ్యింది. అయితే ఇచ్చిన అడ్వాన్స్ కోసం పూజా చేత ఒక ఐటం సాంగ్ చేయించాలనే ప్లాన్ లో ఉన్నారు మేకర్స్. ఇదే కాదు పూజా హెగ్డే ని సినిమాల్లో కేవలం గ్లామర్ షోకి మాత్రమే వాడుతున్నారు. ఈమధ్య కొన్ని సినిమాల్లో హీరోయిన్ పాత్రల కు వచ్చిన క్రేజ్ చూసిన పూజా తన ఆలోచన మార్చుకున్నట్టు తెలుస్తుంది. పాత్ర ప్రాధాన్యత ఉన్న సినిమాలు అయితేనే పూజా హెగ్డే సినిమా కు ఓకే చెప్పాల ని చూస్తుందట. ఈ క్రమంలోనే ఒకటి రెండు సినిమాల ఆఫర్లు వచ్చినా అందులో తన పాత్ర కేవలం గ్లామర్ షోకే పరిమితం గా ఉందని వాటిని కాదన్నదట. పూజా హెగ్డే సినిమాలు కాదంటుంటే మీడియా మాత్రం సీన్ రివర్స్ చేసి ఆమెకు ఆఫర్లు రావట్లేదు అన్నట్టుగా చెబుతున్నారు. పూజా హెగ్డే మాత్రం ఇవేవి పట్టించుకోకుండా తన ప్రాజెక్ట్ లతో బిజీ గా ఉంటుంది. తెలుగు లో అవకాశాలు ఉన్నా లేకపోయినా సరే పూజా బేబీ హిందీ లో మాత్రం ఛాన్స్ లు అందుకుంటుంది. రీసెంట్ గా మాస్ మహరాజ్ రవితేజ గోపీచంద్ కాంబో సినిమా లో పూజా హెగ్డే నటిస్తుందనే వార్త వచ్చింది. అయితే దాని గురించి అఫీషియల్ అనౌన్స్ మెంట్ రావాల్సి ఉంది.

## చీరలో కూడా ఇలా షాక్ ఇస్తున్నావేంటి అలియా?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియాభట్ గురించి స్పెషల్ గా చెప్పక్కర్లేదు. స్టార్ కిడ్ గా తన ప్రయాణం మొదలుపెట్టి, స్టార్ హీరోయిన్ రేంజ్ కి ఎదిగింది. తెలుగులోనూ ఆర్ఆర్ఆర్ లో మెరిసింది. ఆ తర్వాత పెళ్లి చేసుకొని తల్లిగా మారింది. తల్లి అయిన తర్వాత ఆమె తొలిసారిగా ఓ సినిమాకి ఒకే చెప్పింది. అదే రాకీ ఔర్ రాణి. ఈ మూవీలో అలియా రణవీర్ సింగ్ సరసన నటిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ టీజర్, ట్రైలర్ విడుదల చేశారు. ఈరెండూ విపరీతంగా ఆకట్టుకున్నాయి. కాగా, ప్రస్తుతం అలియా ఈ మూవీ ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఈ ప్రమోషన్స్ లో భాగంగా అలియా తన లుక్స్ తో మెస్మరైజ్ చేస్తోంది. ఇప్పటికే ఈ మూవీలో అలియా ఎక్కువగా చీరలే కట్టుకుంటోందని ట్రైలర్ చూస్తే అర్థమైంది. ఇప్పుడు



ప్రమోషన్స్ లోనూ ఆమె అదే రకం చీరలు కట్టుకొని మెరుస్తూ కనిపిస్తోంది. తాజాగా ఆరెంజ్, పింక్ కాంబినేషన్ లో ఉన్న చీరలో మెరిసింది. ఈ చీరలో ఆమె చాలా అందంగా కనిపిస్తున్నారు. స్లీవ్ లెస్ బ్లౌజ్ లో మరింత హాట్ గా కనపడుతోంది. సూపర్, హాట్, క్యూట్ అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. తల్లి అయిన తర్వాత ఆమె నటిస్తు సినిమా ఇది కావడంతో ప్రేక్షకుల్లో ఈ మూవీ పట్ల ఆసక్తి ఎక్కువగా ఉంది. ఈ మూవీకోసం అలియా స్పెషల్ గా ఫోటోషూట్స్ కూడా చేస్తోంది. ఇటీవల ఆమె రాజకుమారిలా ముస్తాబై ఫోటోలకు ఫోజులు ఇవ్వగా, అవి కూడా విపరీతంగా వైరల్ అయ్యాయి. ఇక ఈ చిత్రంతో పాటు అలియా హాలీవుడ్ ఫిల్మ్ 'హార్ట్ ఆఫ్ స్టోన్'లోనూ నటిస్తోంది. కాగా, గతంలో రణవీర్, అలియా కాంబినేషన్ లో గల్లి బాయ్స్ సినిమాలో నటించారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్ అయ్యింది. వీరి పెయిర్, కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయ్యాయి. వీరిద్దరి కాంబినేషన్ లో వస్తున్న రెండో చిత్రం ఇది కావడం విశేషం. అలాగే దర్శకుడు కరణ్ జోహార్ కూడా దాదాపు 7 సంవత్సరాల తర్వాత ఈ మూవీతో మెగా ఫోన్ పట్టడం గమనార్హం. ఈ మూవీ హిట్ అయితే, అలియా కు ఆఫర్ల వర్షం కురిసే అవకాశం ఉంది.




## తమన్నా హీటెక్కించే సాంగ్.. ఇక తెలుగులో షురూ




సూపర్ స్టార్ రజనీకాంత్ హీరో గా నటిస్తున్న తాజా చిత్రం జైలర్. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ మూవీ లో రజనీకాంత్ సరసన తమన్నా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ఈ మూవీ నుంచి ఓ పాట విడుదల చేయగా, ఫుల్ హిట్ అయ్యింది. 'వా నువ్వు కావాలయ్యా నువ్వు కావాలి' అంటూ సాగే ఈ పాట బాగా ట్రెండ్ అయ్యింది. ఎవరి నోట విన్నా ఇదే పాట వినపడుతోంది. అందరూ రీల్స్ ఈ పాటకే చేస్తున్నారు. కాగా, ఇప్పుడు ఈ పాట ను తెలుగులోనూ విడుదల చేశారు. నిజానికి ఈ పాట ను చాలా గ్రాండ్ గా విడుదల చేయాలని అనుకున్నారు. హైదరాబాద్ లోని సీఎమ్ఆర్ కాలేజ్ లో నేడు మిల్కీ బ్యూటీ తమన్నా చేతుల మీద లాంచ్ చేయించాలని అనుకున్నారు. కానీ, వర్షాలు మేకర్స్ ప్లాన్ ని రివర్స్ చేసేశాయి. దీంతో, ఈ ఈవెంట్ ను రద్దు చేసి, ఈ రోజు సాయంత్రం నాలుగు గంటల కు ఈ పాట ను ఆన్ లైన్ విడుదల చేశారు. ఈ పాటను హీరో రానా విడుదల చేయడం విశేషం. అనిరుధ్ ఈ సినిమా కి మ్యూజిక్ అందించగా, ఈ పాటను మాత్రం సింధూజ శ్రీనివాసన్ ఆలపించారు. తెలుగు లోనూ పాట వినసొంపుగా ఉంది. లిరిక్స్ క్యాచీగా ఉన్నాయి. చాలా పాటలు ఒక భాషలో క్లిక్ అయిన తర్వాత, మరో భాషలో వినడానికి అంత వినసొంపుగా ఉండవు. కానీ, ఈ పాట మాత్రం అలా కాదు. ఒరిజినల పాటను వింటున్న అనుభూతే కలిగింది. ఈ పాట కూడా తెలుగు లో రికార్డులు క్రియేట్ చేసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ జైలర్ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్, టాలీవుడ్ నటుడు సునిల్, కన్నడ స్టార్ హీరో శివరాజ్‌కుమార్, రమ్యకృష్ణ, యోగిబాబు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## ఈషా కిల్లింగ్ లుక్స్..!



తెలుగు అమ్మాయి ఈషా రెబ్బ సినిమాల వేగం తగ్గినా తన ఫోటో షూట్స్ తో మాత్రం ఆడియన్స్ ని అలరిస్తుంది. అంతకుముందు ఆ తర్వాత సినిమాతో హీరోయిన్ గా పరిచయమైన ఈషా ఆ సినిమా హిట్ అవడంతో వరుస అవకాశాలు అందుకుంది. స్టార్ ఛాన్స్ ల విషయంలో ఆమె వెనక పడింది. 15 సినిమాల కెరీర్ లో ఎన్.టి.ఆర్ అరవింద సమేతలో మాత్రమే ఆమె హీరోయిన్ సిస్టర్ పాత్ర చేసింది ఈషా రెబ్బ. సోలో హీరోయిన్ గా ఛాన్స్ లు రాకపోవడంతో సినిమాల్లో చిన్న చిన్న పాత్రలను కూడా చేస్తూ వచ్చింది అమ్మడు. ఓటీటీల్లో వెబ్ సీరీస్ లతో కూడా ఆడియన్స్ ని మెప్పించాలని ప్రయత్నించింది ఈషా రెబ్బ. 3 రోజెస్, పిట్టకథలు, మాయాబజార్ ఫర్ సేల్ సీరీస్ లలో కూడా నటించింది. సినిమాలు, వెబ్ సీరీస్ లు ఎలా ఉన్నా ఈమధ్య ఫోటో షూట్స్ తో ఈషా హంగామా చేస్తుంది. ఈ క్రమంలో ఈషా లేటెస్ట్ లుక్స్ కుర్రాళ్లను డిస్టర్బ్ చేస్తుంది. బ్రౌన్ కలర్ డిజైనింగ్ షర్ట్.. డెనిమ్ షార్ట్ తో బీచ్ ఒడ్డున ఈషా లుక్ అదిరిపోయింది. ఈషా ఫోటో షూట్స్ గురించి ఈమధ్య సోషల్ మీడియాలో తెగ డిస్కషన్స్ జరుగుతున్నాయి. గ్లామర్ విషయంలో ఎప్పుడు లిమిట్స్ క్రాస్ చేయని ఈషా తన ఓర చూపులతోనే ఫాలోవర్స్ ని తన బుట్టలో వేసుకుంటుంది. ఈషా రెబ్బ బీచ్ సైడ్ ఫోటోస్ కూడా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. స్టార్ హీరోయిన్ రేంజ్ కి వెళ్లకపోయినా తెలుగులో 15 సినిమాలు 3 వెబ్ సీరీస్ లతో ఈషా తనకంటూ ఒక మంచి పేరు తెచ్చుకుంది. ఈమధ్య సినిమాల విషయంలో దూకుడు తగ్గించినట్టు కనిపిస్తున్నా వస్తున్న అవకాశాన్ని మాత్రం కాదనకుండా చేస్తుంది. ఇక రీసెంట్ గా తమిళంలో ఒక ఆఫర్ అందుకున్న అమ్మడు అక్కడ కెరీర్ కొనసాగించాలని చూస్తుంది. తెలుగులో అయితే ప్రస్తుతం సుధీర్ బాబు నటిస్తున్న మామా మశ్చీంద్ర సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాలో సుధీర్ బాబు మూడు డిఫరెంట్ రోల్స్ లో కనిపిస్తున్నారు. మామా మశ్చీంద్ర అయినా ఈషా కి మంచి హిట్ అందిస్తుందేమో చూడాలి. టాలీవుడ్ లో గొప్పగా అవకాశాలు రాకపోవడంతో కోలీవుడ్ పై ఫోకస్ చేస్తుంది ఈషా రెబ్బ. అంతకుముందు మలయాళంలో కూడా రెండు సినిమాలు చేసిన ఈషా అక్కడ సినిమా ప్రయత్నాల్లో కూడా ఉందని టాక్.

## వైష్ణవి.. శ్రీలీల రేంజ్ ను అందుకుంటుందా?

తెలుగు సినిమాల్లో తెలుగు అమ్మాయిలు కనిపించరు. ఇది చాలా కాలంగా వినపడే మాట. ఒకవేళ తెలుగు అమ్మాయిల కు నటించే అవకాశం వచ్చినా, అది హీరోయిన్ రోల్ అయితే అయ్యి ఉండదు. హీరో చెల్లెలి క్యారెక్టరో, లేదంటే, ఇంకేదైనా సైడ్ క్యారెక్టరో వస్తుంది. అలా అని ఇప్పటి వరకు తెలుగు అమ్మాయిలు అసలు హీరోయిన్ గా సినిమాలు చేయలేదా అంటే, ఈ మధ్యకాలం లో కొందరు చేశారు. కానీ చిన్న సినిమాలకే అది కూడా ఒకటి, రెండు చేసి సైడ్ అయిపోయారు. ఎక్కువగా, వేరే భాషల్లో అమ్మాయిలే ఈ ఇండస్ట్రీని ఏలుతున్నారు. అయితే, ఇప్పుడు కాలం మారింది. తెలుగు అమ్మాయిలు కూడా హీరోయిన్లు గా చేసి రాణించగలం అని నిరూపిస్తున్నారు. వారిలో ఇప్పుడు శ్రీలీల ముందుంది. ఈ తెలుగు అమ్మాయి మొదట వేరే భాషల్లో హీరోయిన్ గా చేసి అదరగొట్టింది. ఆ తర్వాత ఇక్కడ



హీరోయిన్ గా వచ్చి, ఇప్పుడు మోస్ట్ బిజీ హీరోయిన్ గా మారిపోయింది. అయితే, ఇప్పుడు శ్రీలీల అడుగు జాడల్లో నడుస్తోంది బేబీ వైష్ణవి చైతన్య. యూట్యూబర్ గా తన కెరీర్ ని మొదలుపెట్టిన ఈ అమ్మాయి తర్వాత సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేసింది. అక్కడి నుంచి ఇప్పుడు తన కెరీర్ ని సిల్వర్ స్క్రీన్ పై చూసుకునేలా మార్చుకుంది. బేబీ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కేవలం మూవీ హిట్ అవ్వడం కాదు, సినిమా మొత్తాన్ని తన భుజాల పై మోసింది. ఆ మూవీ లో తన క్యారెక్టర్ ని ఆమె చూపించిన విధానం, ఆ అమ్మాయి నటన కు అందరూ ఫిదా అయిపోయారు. దీంతో, ఇప్పుడు ఎక్కడ చూసినా వైష్ణవి పేరే వినపడుతోంది. అందరూ, ఈ మూవీ పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ముఖ్యంగా వైష్ణవి ని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ప్రస్తుతం ఈ బేబీ కి ఆఫర్లు క్యూ కడుతున్నాయని తెలుస్తోంది. దాదాపు, చాలా మంది చిన్న హీరోల సినిమాల్లో వైష్ణవిని అడుగుతున్నారట. అయితే, క్యారెక్టర్ల విషయం లో కొంచెం జాగ్రత్తలు తీసుకుంటూ, మళ్లీ ఇలాంటి సినిమా కాకుండా, మంచి పాత్రలు చేస్తే, వైష్ణవి హీరోయిన్ గా క్లిక్ అయినట్లే అనే కామెంట్స్ వినపడుతున్నాయి. అంతేకాదు, మరో శ్రీలల కావడం పక్కా అని అంటున్నారు. చూడాలి మరి వైష్ణవి కెరీర్ ఎలా మారుతుందో.

## ఆస్ట్రేలియాలో అరియానా.. కంగారు పెట్టె గ్లామర్ షో!

అరియానా, ఇప్పుడు ఈ పేరు తెలుగు ప్రేక్షకుల కు స్పెషల్ గా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. బిగ్ బాస్ పుణ్యమా అని ఈ బ్యూటీ అందరికీ పరిచయం అయ్యింది. అంతకు ముందు కొన్ని ఛానెల్స్ లో యాంకరింగ్ చేసింది కానీ పెద్దగా గుర్తింపు రాలేదు. ఒక్కసారి సెలబ్రెటీ ఇంటర్వ్యూలో ఆర్జీవీ ని ఈమె ఇంటర్వ్యూ చేయడం, ఆయన అరి పాప అందాలను పొగడటం తో ఒక్కసారిగా అందరి కన్ను ఆమె పడింది. ఫలితం బిగ్ బాస్ లో ఆఫర్ వచ్చింది. అక్కడి నుంచి గుర్తింపు తెచ్చుకొని, సెలబ్రెటీ గా మారిపోయింది. ఇక ఈ బ్యూటీ సోషల్ మీడియా లో సైతం చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన అప్ డేట్స్ ఇస్తూనే ఉంటుంది. తన ఫ్యాన్స్ కి



ఫోటోలు షేర్ చేస్తూనే ఉంటుంది. కాగా అరియానా ను చాలా మంది ఫ్యాన్స్ బోల్డ్ బ్యూటీ అని పిలుచుకుంటూ ఉంటారు. ఆమె డెసిషన్స్, ఆలోచనలు అన్నీ బోల్డ్ గా ఉంటాయని వారి అభిప్రాయం. అయితే, ఈ హాట్ బ్యూటీ ఆమె ఆలోచనల సంగతేమో కానీ, దుస్తుల విషయంలో మాత్రం బోల్డ్ గా మారింది. క్లీవేజ్ షోల తో మతిపోగొడుతూ ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు ఆస్ట్రేలియా టూర్ కి వెళ్లింది. అక్కడ మెల్ బోర్న్ లో ఓ షాపింగ్ మాల్ లో ఫోటోల కు ఫోజులు ఇచ్చింది. స్లైడ్ స్లీవ్ డ్రెస్ లో తన థైస్ తో హాట్ షో చేసింది. ఈ ఫోటోలు చూస్తుంటే కొంచెం బొద్దుగా మారినట్లు తెలుస్తోంది. గతం లో సన్నజాజి తీగలాగా, జూనియర్ ఇలియానాలో ఉండేది. కానీ, ఇప్పుడు కొంచెం బొద్దుగా మారడంతో ఫ్యాన్స్ బాగా హర్ట్ అవుతున్నారరు. మళ్లీ సన్నగా అయిపోవా అంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. దాదాపు ఆమె ఫోటో కింద కామెంట్స్ అన్నీ, ఆమె లావుగా అవ్వడం గురించే కావడం గమనార్హం. ఇదిలా ఉండగా, బిగ్ బాస్ సీజన్ 4 తర్వాత ఈ బ్యూటీ చాలా బిజీ గా మారింది. ఆ మధ్య ఓ వెబ్ సిరీస్ లోనూ నటించింది. ఆ తర్వాత మళ్లీ బిగ్ బాస్ ఓటీటీ షో ద్వారా అదరగొట్టింది. మధ్యలో అదే బిగ్ బాస్ లో యాంకరింగ్ చేసింది. మొత్తానికి బిగ్ బాస్ దత్త పుత్రిక గా మారి.. స్టార్ మాలో ఏదో ఒక ప్రోగ్రామ్ తో బిజీగా గడుపుతోంది. ఈమధ్యే కాస్త టీవీకి దూరమైంది. మళ్లీ బిగ్ బాస్ షో మొదలవ్వగానే సందడి చేసే అవకాశం లేకపోలేదు.




## తెలంగాణలో వరద బాధితుల సహాయ చర్యలపై హైకోర్టులో పిల్...

హైదరాబాద్ : తెలంగాణలో వర్షాలు వద్దంటే దంచికొట్టాయి.! శుక్రవారం కాస్త గ్యాప్ ఇవ్వడంతో తెలంగాణ ప్రజలు ముఖ్యంగా భాగ్యనగర ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

ఈ వర్షాలతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల వరద బాధితులకు సహాయం చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో వరద సహాయక చర్యలపై రాష్ట్ర అత్యున్న న్యాయస్థానం హైకోర్టులో సీనియర్ నేత డాక్టర్ చెరుకు సుధాకర్ పిల్ వేశారు. దీనిపై 3 గంటల ప్రాంతంలో న్యాయస్థానం విచారణ జరిపింది. 'వరద బాధితుల సహాయ చర్యలపై నివేదిక ఇవ్వండి. వరద ప్రాంతాల్లో ఏం చర్యలు తీసుకున్నారో కోర్టుకు తెలపండి. వరదల్లో ఎంత మంది మరణించారు..? ఆ కుటుంబాలకు పరిహారం చెల్లించారా..?. ముంపు ప్రాంతాల నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారా..? లేదా..?. పునరావాస కేంద్రాల్లో ఎలాంటి సదుపాయాలు కల్పించారో తెలపండి. వరదలపై పర్యవేక్షణ, సాయం కోసం కంట్రోల్ ఏర్పాటు చేశారా?. ఈనెల 31 వరకు పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలి' అని కేసీఆర్ సర్కార్‌పై హైకోర్టు పలు ప్రశ్నలు సంధిచడమే కాకుండా కీలక ఆదేశాలు సైతం జారీచేసింది. ఎన్నికల కోసం వార్ రూమ్‌లు ఏర్పాటు చేస్తారు కదా..? మరి.. వరదల కోసం వార్‌రూమ్ ఎందుకు ఏర్పాటు చేయలేదు..? అని న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

అయితే.. ప్రాజెక్టుల పరిసర ప్రజలు భయాందోళనలతో ఉన్నారని న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు వినిపించారు. డ్యామ్ పరిరక్షణ చట్టానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే.. ప్రభుత్వం నివేదికలో ఏం చెబుతుందా అనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.




న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం పరిగణలోకి తీసుకుంది. శుక్రవారం జరిగిన విచారణలో మహిళను విచారణ కోసం ఈడీ కార్యాలయానికి పిలిపించవచ్చా లేదా అన్న అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేసింది. మహిళను ఈడీ కార్యాలయానికి పిలిపించి విచారించడాన్ని సవాల్ చేస్తూ కవిత సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం అందరికీ తెలిసిందే. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సంజయ్ కిషన్ కౌర్ ధర్మాసనం.. కవిత పిటిషన్‌ను పరిగణలోకి తీసుకుంది. కవిత పిటిషన్‌పై ఆరు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఈడీకి న్యాయస్థానం ఆదేశించింది. ఆ తర్వాత రెండు వారాల్లో రిజోయిండర్ దాఖలు చేయాలని కవితకు సూచించారు. కాగా కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. అలాగే విచారణకు హాజరైన తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచందర్ రావు తదితరులు హాజరయ్యారు.

## ప్రభుత్వ అత్యవసర సేవల సిబ్బందికి అభినందనలు : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ అత్యవసర సేవల సిబ్బందికి రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. సహాయక చర్యల్లో నిమగ్నమై ప్రజలకు ఇబ్బంది కలగకుండా మీరు చేస్తున్న సేవలు అమూల్యం అని మంత్రి కొనియాడారు. సీఎం కేసీఆర్ నిరంతర పర్యవేక్షణలో విపత్తు నిర్వహణ, పోలీసు, మున్సిపల్, పంచాయతీ, ఆరోగ్య సహా అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్న తీరు అభినందనీయం అని మంత్రి పేర్కొన్నారు. వానలు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నాను అని హరీశ్‌రావు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.




## జీహెచ్ఎంసీ కార్యాలయం దగ్గర ఉద్రిక్తత..

హైదరాబాద్: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం దగ్గర హై టెన్షన్ నెలకొంది. వర్షాలు, వరదలు ఎదుర్కోవడంలో ప్రభుత్వం వైఫల్యానికి నిరసనగా కాంగ్రెస్ ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కార్యాలయం దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. కార్యాలయంలోకి ఎవరినీ అనుమతించడంలేదు. గన్‌పార్కు నుంచి ర్యాలీగా కాంగ్రెస్ శ్రేణులు బయలుదేరారు. ఇటు గ్రేటర్ హైదరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేతలందరూ జీహెచ్ఎంసీ కార్యాలయం దగ్గరకు చేరుకున్నారు. ఆఫీసు ముందు బైఠాయించి అధికారుల తీరుకు వ్యతిరేకంగా ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి తో మాట్లాడుతూ హైదరాబాద్‌ను విశ్వనగరంగా తయారు చేస్తామని మంత్రి కేటీఆర్ చెప్పారని, విశ్వనగరం కాదుకదా.. ఇప్పుడు చెత్తనగరంగా తయారు చేశారని విమర్శించారు. నగరాన్ని కాపాడాల్సిన అవసరముందన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యానని, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ఇబ్బందులు పడుతున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం రూ. 10వేల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యేలు, మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నాళాల పూడిక తీయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

## ఈ 3 నెలలైనా హైదరాబాద్‌పై కేసీఆర్ దృష్టి పెట్టాలి



హైదరాబాద్: హైదరాబాద్ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. అంబర్‌పేటలో వర్షాలకు నీటమునిగిన కాలనీలను కిషన్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ నుంచి 80 శాతం ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి వస్తుందని, కానీ 8 శాతం కూడా హైదరాబాద్ బాగు కోసం కేటాయించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం నిధులు ఇవ్వక కాంట్రాక్టర్లు జీహెచ్ఎంసీ ముందు ధర్నా చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల అప్పులు చేసినా కూడా హైదరాబాద్ అభివృద్ధికి మౌలిక వసతులు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఉండే మూడు నెలలు అయిన సీఎం కేసీఆర్ హైదరాబాద్ గురించి ఆలోచించాలని కోరారు.

## ఎంపీకి సమాచారం ఇవ్వకపోతే పార్లమెంట్‌లో ఎలా చర్చిస్తారు?: హైకోర్టు



హైదరాబాద్: ఓఆర్ఆర్ టోల్ కాంట్రాక్టు సమాచారంపై ఎంపీ రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఓఆర్ఆర్ టెండర్లపై ఆర్టీఐ కింద సమాచారం ఇవ్వడం లేదని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు.

ఎంపీ అడిగిన సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. ఎంపీకి సమాచారం ఇవ్వకపోతే పార్లమెంట్‌లో ఎలా చర్చించగలరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సమాచార హక్కు చట్టం పరిమితుల మేరకు సమాచారం ఇస్తారని ఈ సందర్భంగా ఏజీ ప్రసాద్ కోర్టుకు తెలిపారు. పూర్తి వివరాలు సమర్పించేందుకు రెండు వారాల సమయం కావాలని కోరారు. రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టుకు రెండు వారాలకు వాయిదా వేసింది.

## వరంగల్ వరదలపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నిరంతర పర్యవేక్షణ: మంత్రి ఎర్రబెల్లి



హనుమకొండ: నలభై ఏండ్లల్లో ఎన్నడూ లేని వర్షాలు ఈసారి పడ్డాయని, వరదలపై విపక్షాలు రాజకీయాలు చేయడం సరికాదని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వరదలతో చాల కాలనీలు జలమయం అయ్యాయని చెప్పారు. నీట మునిగిన కాలనీల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. వారికి ఆహారం, మంచినీటి బాటిళ్లు అందించామని తెలిపారు. హనుమకొండ జిల్లా గ్రేటర్ వరంగల్ పరిధిలోని జవహర్‌కాలనీ, గుండ్ల సింగారం ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ కలిసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు చాలా కష్టపడ్డారని, వారి శ్రమ వెలకట్టలేదని చెప్పారు. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు సహాయం అందించారని తెలిపారు. వరంగల్ వరదలపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారని వెల్లడించారు. అనంతరం మామునూరు హెలీప్యాడ్ నుంచి ఏటూరు నాగారం, కొండాయిలో వరదల్లో చిక్కుకున్న ప్రజలకు ఆహార పొట్లాలు, తాగు నీరు, మందులను హెలికాప్టర్ ద్వారా పంపించారు. భద్రాచలం ప్రాంతంలో వరదల్లో చిక్కుకుని ఆందోళన చెందుతున్న బాధితుల కోసం ప్రత్యేక హెలికాప్టర్‌ను, సహాయక బృంధాలను పంపించారు.

## వరంగల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో కుండపోతగా కురుస్తున్న వర్షం



వరంగల్/ఆసిఫాబాద్: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గంలో రాత్రి నుంచి కుండపోతగా వర్షం కురుస్తున్నది. దీంతో కుమ్రం భీం ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. అధికారులు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తడంతో పెద్దవాగులో వరద ప్రవాహం పెరిగింది. ఈనేపథ్యంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలాల్లోని పెద్దవాగు తీర పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కాగా, సిర్పూర్.టీ మండలం వెంకటాపురం వద్ద ప్రాణహితలో వరద ప్రవాహం పెరిగింది. పారిగాం వద్ద ప్రాణహిత బ్యాక్ వాటర్ రోడ్డుపైకి వస్తున్నది. సలుగుపల్లి వద్ద సుస్మీర్ తీగల ఒర్రె ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించిపోయాయి. చింతలమానేపల్లి మండలంలోని దిందా, రణవెల్లి, నాయకపు గూడ, శివపెల్లిలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దహేగాం మండలంలో ఉచ్చమల్ల వాగు, పెద్దవాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరంగల్ జిల్లాలో కుండపోతగా వర్షం కురుస్తున్నది. వర్షం కారణంగా పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షంతో ఆకేరు వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నది. వర్ధన్నపేట, రాయపర్తి, సంగెం, పర్వతగిరి, ఐనవోలు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంతిని ఊరచెరువు 5 అడుగుల ఎత్తులో ప్రవహిస్తున్నది. దీంతో వరంగల్-ఖమ్మం రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

## ఎన్డీఆర్ఎఫ్ బృందానికి ధన్యవాదాలు: మంత్రి పువ్వాడ




ఖమ్మం జిల్లా: వరదలో చిక్కుకున్న కుటుంబాన్ని ఎన్డీఆర్ఎఫ్ బృందం రక్షించింది. దీంతో మంత్రి పువ్వాడ అజయ్ శుక్రవారం ఖమ్మంలో ఎన్డీఆర్ఎఫ్ బృందంతో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్డీఆర్ఎఫ్ బృందానికి ధన్యవాదాలు తెలుపుతూ సన్మానించారు. మున్నేరు చరిత్రలో ఇంత వరద ఉధృతి చూసింది ఇదే ప్రథమం అని అన్నారు. సుమారు 5 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చిందని, ఎంత వేగంగా వచ్చిందో.. అంతే వేగంగా వెళ్ళిందన్నారు. ఎవరు ఊహించని విధంగా వరద ఉధృతి వచ్చిందన్నారు. 26 అడుగులు దాటి వరద ఉధృతి ఎప్పుడు రాలేదు కానీ ఈ సారి 30 అడుగులపైన వరద ఉధృతి వచ్చిందన్నారు. కొత్తగూడెం కోసం వెళ్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని ఖమ్మంకు తీసుకుని వచ్చామని మంత్రి పువ్వాడ తెలిపారు. వారు వచ్చే సమయానికి చీకటి పడిందని ఆ సమయంలో కాపాడతారో లేదో అనుకున్నాం.. కానీ వారు అందరినీ రక్షించారని కొనియాడారు. 6 నెలల పాప నుంచి వృద్ధుల వరకు అందరినీ రక్షించామన్నారు. అధికారులు ఎన్డీఆర్ఎఫ్ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు భద్రాచలంలో ఉన్నాయన్నారు. సతీష్ మరణం దురదృష్టకరమని, అతను రెండు సార్లు వెళ్లాడని, మూడవసారి అధికారులు వెళ్లొద్దని చెప్పిన వెళ్ళాడని, మీడియా మిత్రులు కూడా చాలా రిస్క్ చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల ప్రాణాలు సురక్షితంగా ఉండాలని ఆదేశించారని, అందుచేత భద్రాచలంలో సుమారు 60 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్‌తోపాటు, కలెక్టర్ గౌతం, సీపీ విష్ణు వారియర్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు భారీగా వరదల



హైదరాబాద్ : హైదరాబాద్‌లోని జంట జలాశయాలకు భారీగా వరద వచ్చి చేరుకుంటోంది. ఉస్మాన్ సాగర్ ఇన్ ఫ్లో 1600 క్యూసెక్కులకు చేరుకుంటోంది. ఉస్మాన్ సాగర్ ప్రస్తుత నీటి మట్టం 1787.95 అడుగులకు చేరుకుంది. ఉస్మాన్ సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులకు చేరుకుంది. ఉస్మాన్ సాగర్ 4 గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి 852 క్యూసెక్కుల నీటిని అధికారులు మూసిలోకి వదిలారు. హిమాయత్ సాగర్‌కు 3000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుకుంటోంది. హిమాయత్ సాగర్ ప్రస్తుత నీటిమట్టం 1762.20 అడుగులకు చేరుకుంది. హిమాయత్ సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులకు చేరుకుంది. హిమాయత్ సాగర్ రెండు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి 2750 క్యూసెక్కుల నీటిని అధికారులు మూసిలోకి విడుదల చేశారు.

## తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ పై విమర్శలు..



హైదరాబాద్ : ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విపత్కర పరిస్థితులలో మానిటరింగ్ సెల్లుగా పనిచేస్తోందని అధికారులు అంటున్నారు. కానీ వరదల సమయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎందుకూ పనికిరావడం లేదని బాధితులు అంటున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డీజీపీ, ముఖ్యమంత్రికి ప్రత్యేక ఛాంబర్లు ఏర్పాటు చేశారు. మరో ఫ్లోర్లో జీహెచ్ఎంసీ అధికారులకు సైతం ప్రత్యేక ఛాంబర్లు ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు కమాండ్ కంట్రోల్ సెంటర్ మాత్రం ఇంకా అందుబాటులోకి రాలేదు. డీజీపీ కార్యాలయం నుంచి డీజీపీ, జీహెచ్ఎంసీ కార్యాలయం నుంచి మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. పేరుకు మాత్రమే రాష్ట్ర వ్యాప్తంగా సమీక్షలు అన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిర్వహించాలని గతంలో ఆదేశాలు జారీ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com